ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024





కొల్లూరు : వరద నీటిలో ఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల ఏరియల్ వ్యూ

శాంతించిన కృష్ణమ్మ

తగ్గుముఖం పడుతున్న ఉధృతి



సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ శాఖ, విద్యుత్‌శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు



కొల్లిపర: పిడపర్తిపాలెం వద్ద కరకట్ట కోతకు గురికావటంతో ఇసుక బస్తాలు వేసిన పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు



సీతానగరం వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

మహోగ్రంగా ముంచుకొస్తోన్న కృష్ణమ్మ శాంతించింది. వర్షాలకు తోడు, పొంగి పొర్లుతున్న వాగులతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఉధృతి మంగళవారం మధ్యాహ్నం కొంతమేర తగ్గింది. నాగార్జున సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రికి సగానికి సగం పడిపోయింది. వరద ప్రవాహం సుమారు 2 లక్షల క్యూసెక్కులకుపైగా తగ్గింది. దీంతో నదీ పరివాహక గ్రామాలు, ప్రకాశం బ్యారేజి దిగువ లంకల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు ఇప్పుడిప్పుడే తెరుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు కరకట్ట వెంబడి జాగ్రత్తలు తీసుకుంటూ ఎక్కడా గండి పడకుండా, లీకులు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో వరద ఉధృతి తగ్గడం.. బుధవారానికి ప్రవాహం ఇంకా తగ్గవచ్చన్న జలవనరుల శాఖ అంచనా నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో టెన్షన్ తగ్గింది. లంకల్లో ఒక్క రోజులోనే మూడు అడుగుల మేర నీరు తగ్గుముఖం పట్టింది. కలిసి నడిచిన అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, చేయిచేయి కలిపిన గ్రామస్థుల కారణంగా పెనుగండం తప్పిందని భావించారు. అయితే ప్రవాహం తగ్గడంతో ఇప్పడిప్పుడే నష్ట పరిణామాలు వెలుగుచూస్తున్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాల్సి ఉంది. ప్రజలు తేరుకుంటున్నా వరద కారణంగా ఇళ్లు, పశుపక్షాదులు, పంటలకు జరిగిన నష్టంపై ఆందోళన చెందుతున్నారు.

- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- వెలుగు చూస్తోన్న 'కన్నీటి' కష్టాలు
- కరకట్టకు గండ్లు, లీకులపై తొలుత ఆందోళన
- కలిసొచ్చిన సమన్వయం.. చర్యలతో తప్పిన గండం
- అర్ధరాత్రి దాటాక కరకట్టలను పరిశీలించిన మంత్రులు
- బ్యారేజి దిగువున ముంపులోనే లంకలు.. అల్లాడుతున్న ప్రజలు

తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఎప్పుడు కరకట్టను కోసేస్తుందోనని.. ఎక్కడ గండిపడుతుందోనని.. ఎప్పుడు ఏ ఊరిపై వరద ప్రవాహం పడుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఉన్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందినా ఆ పరిస్థితి లేకుండా పోయింది. పట్టపగ్గాలు లేకుండా.. ప్రవాహ ఉధృతితో పరుగులు పెడుతున్న కృష్ణమ్మ శాంతించింది. మంగళవారం నాగార్జున సాగర్ జలాశయం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు తెరుకుంటున్నారు. నదీ తీరం వైపు వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి వరద ప్రవాహం ఇంకా తగ్గవచ్చని అంచనా. సోమవారం వరకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తే, అదే రోజు రాత్రి నుంచి వరద ఉధృతి తగ్గుతూ వస్తోంది. ప్రకాశం బ్యారేజి దగ్గర మంగళవారానికి 6.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా మంగళవారం సాయంత్రం వరకు 4.20 లక్షల వరకు వరద నీటిని బ్యారేజికి విడుదల చేసినా, దానిని కూడా 3.87 లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. అటు మునేరు, పాలేరు, కీసర వంటి వాగుల నుంచి కూడా వరద తగ్గిపోయింది. వర్షాలు కూడా లేకపోవడంతో వాగుల నుంచి ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల లోపే వరద నీరు బ్యారేజికి చేరుతోంది. బుధవారానికి వరద మరింత తగ్గిపోతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు చెప్తున్నారు. అమరావతి, అచ్చంపేట, రెంటచింతల మండలాల్లోని లంక గ్రామాల్లో పరిస్థితులు ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్నాయి. లంక గ్రామాల్లో ముంపు అంత వేగంగా తగ్గడంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కరకట్టకు లోపల ఉన్న ఊళ్లన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లోని ఇళ్లు నాలుగు రోజులుగా నీటిలో నానిపోయి ఉన్నాయి. ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందోనని పాత ఇళ్లవారు భయపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ముంపు నుంచి కొన్ని గ్రామాలు, లంకలు, అందులోని ఇళ్లు బయటపడుతున్నా నీరు బయటకు పోయిన తర్వాత మట్టి కూడా పేరుకుని, దానిని శుభ్రం చేసుకోవడం కష్టతరమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆయా మండలాల పరిధిలో చాలాచోట్ల ఇంకా రహదారులు బయటపడలేదు. పలు ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో విషసర్పాలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. నీటిలో మూడు రోజులుగా చిక్కుకుపోయిన గ్రామాల వారికి అధికారులు ఆహారం, తాగునీటి డబ్బాలను మంగళవారం కూడా సరఫరా చేశారు. అయితే ఇవి అందరికీ సక్రమంగా చేరడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. జనం పరిస్థితి ఇలా ఉంటే.. మూగజీవాల కష్టాలు వర్ణనాతీతమే. వరద ఉధృతికి చాలా ఊళ్లలోని వాములు కొట్టుకుపోయాయి. మంగళవారం కూడా రోడ్లపైనా నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు. పశువులను మెరకల్లో కట్టేసే పరిస్థితిలేదు. వర్షాలు, వరదల కారణంగా గుంటూరు జిల్లాలోని 11 మండలాలు వరద, వర్ష ప్రభావానికి గురికాగా 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడగా 35,345.2 హెక్టార్లలో నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

లీకులు.. పోటుతో ఆందోళన..

కరకట్టలకు సమాంతరంగా సాగుతున్న నీటి ప్రవాహం ఓ వైపు.. లీకులతో నీటి చెమ్మలు కరకట్టలపైకి ఎగతన్నడం.. లీకుల గుర్తింపు.. మరోవైపు అమావాస్య ప్రభావంతో సముద్రంలో పోటుతో.. ఎప్పటికి వరద ముంపు తగ్గుతుందోనని ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు వరకు కలవరపడ్డారు. కట్టలకు గండిపడే అవకాశం ఉంది అప్రమత్తంగా ఉండాలనే ముందస్తు హెచ్చరికలు.. గంటగంటకు పెరుగుతున్న నీటి ప్రవాహం నేపథ్యంలో కరకట్టలకు తాత్కాలిక మరమ్మతులతో ముప్పు తప్పింది. ఈ కృతువులో ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భాగస్వాములయ్యారు. రేపల్లె ప్రాంతంలో 2009 నాటి పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందన్న ఆందోళన నెలకొన్నా.. ముప్పు తప్పేలా అందరూ కలిసికట్టుగా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కూడా కరకట్టల వద్దే అధికారులు ఉండగా మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. బ్యారేజీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అధికారులతో పాటు ప్రజలు పెను గండం తప్పినట్లైందని ఊపిరి పీల్చుకున్నారు. రావి అనంతవరం, పెదపులివర్రు తదితర ప్రాంతాల వద్ద లీకులను గుర్తించిన వెంటనే పూడ్చేశారు. రైతుల సహకారం తీసుకుని, అధికారులను సమన్వయపరిచి ఇసుక బస్తాలు, కంకరను తరలించి కరకట్టను ఎక్కడికక్కడ తాత్కాలికంగా పటిష్ఠ పరిచే పనులను చేపట్టడంతో గండం గట్టెక్కారు.




రాయపూడి వద్ద వరదల్లో చిక్కుకున్న వారిని బోట్‌లో తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



ప్రకాశం బ్యారుజీపై రాకపోకలు నిలిపివేసి బందోబస్తులో ఉన్న పోలీసులు

- పులిచింతల వద్ద వరద ఉధృతి



మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో రేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంత్రులు, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడీ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో సమీక్షించారు. అధి కారులు సకాలంలో స్పందించి కృషి చేయడం వల్లే ఎక్కడా ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ఉధృతికి కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతానికి కృషి చేయాలన్నారు. లంక గ్రామాల్లో 1000 మంది లైన్‌మన్లను పంపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న 24 గ్రామాల్లోని 24 వేల మందికిపైగా జనం ఇబ్బందులు పడకుండా జనరేటర్లు, విద్యుత్ దీపాలు, ఆహార పదార్థాలు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు చోట్ల కరకట్ట బలహీనపడి లీక్ అవుతున్నా గ్రామస్తుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించగలిగామన్నారు. రేపల్లె మండలం పెనుమూడిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంత్రులు సందర్శించి బాధితులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రాంతాలను ఇసుకగోతాలతో పటిష్ఠం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం

- మంత్రి మనోహర్

వరద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. కరకట్ట కోతలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. నదికి వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలకు అండగా ఉంటామన్నారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ కొల్లిపర, మండలం అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లోని పంటలను డైరెక్టర్ డిల్లీరావు, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు.



కొలకలూరు: హాఫ్‌పేట వద్ద మునిగిన వరిపైర్లు



రేపల్లె : పల్లెపాలెంలో తగ్గిన వరద ఉధృతి



విజయవాడలో వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న వడ్డేశ్వరం అక్టోపస్ సిబ్బంది

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- అవార్డు గహీతలకు రేపు కలెక్టరేట్‌లో సత్కారం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి పీ శైలజ మంగళవారం ప్రకటించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సాయంత్రం 3 గంటలకు జరిగే జరిగే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి, సత్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 14 మంది వివరాలు.. షేక్ షాపుల్లా(జడ్పీ హెచ్‌ఎస్ కొర్నెపాడు), పోగతోట సునీతరజిని(ఎస్‌ఎస్‌ఎన్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు), అబ్దుల్ షాజీర్(ఎంపీయూపీ ఉర్దూ, నులకపేట, తాడేపల్లి), ఆచన కోటేశ్వరరావు(జడ్పీహెచ్ఎస్, మందడం), బీ రమేష్‌బాబు(జడ్పీహెచ్ఎస్,పెనుమాక), డీ నాగకృష్ణకుమారి(జడ్పీ హెచ్ఎస్, దుగ్గిరాల), కసుకుర్తి బాస్కరరావు(ఎంపీపీఎస్, చింతలపూడి, పొన్నూరు), తలతం సుబ్బారావు(యూపీపీ స్కూల్, పేరేచర్ల, మేడికొండూరు), షాహిద్‌ఆలీషేక్(ఎంపీయూపీ ఉర్దూ, నులకపేట, తాడేపల్లి), షేక్ అనిలాసుల్తానా(జడ్పీహెచ్ఎస్ నిడమర్రు, మంగళగిరి), జొన్నలగడ్డ జోసెఫ్‌సుధీర్‌బాబు(జడ్పీ హెచ్ఎస్ చినకొండ్రుపాడు ప్రత్తిపాడు మండలం), వల్లు శ్రీరామ్‌ప్రసాద్(ఎంపీపీఎస్ కాకుమాను), షహనాజ్‌బేగం(మున్సిపల్ కార్పొషన్ స్కూల్ ఉర్దూస్కూల్ సంగడిగుంట), అరిగ పద్మ(జడ్పీహెచ్ఎస్ దుగ్గిరాల)లు అవార్డులకు ఎంపికయ్యారని డీఈవో తెలిపారు. అవార్డు గ్రహీతలు 5న మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరానికి వచ్చి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మిర్చి యార్డులో.. కలకలం

- సెక్రెటరి, సిబ్బందితో బృందం భేటీ
- చెక్‌లిస్టు ప్రకారం ఫైళ్లు కావాలని ఆదేశాలు
- త్వరలో అవినీతి, అక్రమాలు నిగ్గు తేలే అవకాశం
- అప్పటి పాలకులు, అధికారుల గుండెల్లో గుబులు
- కమీషన్ వ్యాపారుల వాంగ్మూలాల నమోదుకు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలకు రావడం కలకలం సృష్టించింది. ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విధం గా మంగళవారం ఉదయం ప్రాంతీయ నిఘా కార్యాలయం అధి కారులు యార్డు పరిపాలన భవనానికి చేరుకుని సెక్రెటరి ఐ వెంకటేశ్వరరెడ్డితో భేటీ అయ్యారు. తొలుత యార్డు కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2014-19 మధ్య జరిగిన వ్యవహారాలకు సంబంధించి తమకు ఫైళ్లు, డాక్యుమెంట్లు అందజేయాలని ఒక చెక్‌లిస్టును అందజేశారు. ఉదయం, మధ్యాహ్నం కూడా విజిలెన్స్ అధికారులు మిర్చియార్డులోనే ఉండి సమగ్రంగా వివరాలు సేకరించడం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించిందన్న సమాచారం యార్డు వర్గాల్లో మంగళవారం అంతా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తాని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై డీజీ విచారణకు ఆదేశించడంతో ప్రాంతీయ కార్యాలయం సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ కే నాగమల్లేశ్వరరావు, మరో ముగ్గురు సిబ్బందితో ఒక టీమ్‌ని నియమించారు. ఆ మేరకు విజిలెన్స్ బృందం తొలుత యార్డు పరిపాలన భవనానికి చేరుకుని తమ విచారణని ప్రారంభించింది. 2019 జూన్, జూలై, ఆగస్టులో 5 లక్షల మిర్చి టిక్కీలను ఈ-నామ్‌లో నమోదు చేయలేదు. వీటి విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. అప్పట్లో ఆరోపణలు రాగా దీనిపై మొక్కుబడి విచారణ జరిపి ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకుండా మూసేశారని విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంలో అప్పటి సెక్రెటరితో పాటు 10 మంది సూపర్‌వైజర్ల పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు కోరారు. ప్రధానంగా 2023లో కేవలం రెండు నెలల వ్యవధిలో జరిగిన కమీషన్ వ్యాపారుల 400 రెన్యువల్స్, 180 వరకు జరిగిన పార్టనర్‌షిప్ డీడ్‌లకు సంబంధించి భారీగా నగదు చేతులు మారినట్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో దీనికి సంబంధించిన ఫైళ్లను తమకు పంపాలని ఆదేశించారు. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఏ విధంగా ఇస్తారు. వాటి విధివిధానాలను తెలియజేయాలని కోరారు. అలానే యార్డులో వేమెన్ల వ్యవస్థ గురించి, మచ్చుకాయల మాఫియా గురించి వాకబు చేశారు. యార్డులో గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వేబ్రిడ్జీలలో ఒక్కటి కూడా పని చేయకపోవడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. యార్డులోకి వచ్చే సరుకుకు సక్రమంగా అకౌంటబిలిటీ లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని గుర్తించారు. లైసెన్సులను వేరే వ్యక్తులకు లీజుకు ఇవ్వడం వంటి వివరాలు కూడా వివిధ వర్గాల నుంచి సేకరించారు. జీఎస్‌టీ రూపంలో ఆదాయానికి పడిన గండి గురించి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ తాము ఫైళ్లన్నింటిని తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాత వ్యాపారులు, ఉద్యోగుల వాంగ్మూలాలు నమోదు చేస్తామన్నారు. చివరిగా అవినీతి, అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.



మిర్చియార్డులో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు

సాగుదారుని పేరు నమోదు చేయండి

● వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి రాజశేఖర్



దంతలూరులో వర్షానికి మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 3 : కృష్ణానది వరదకు, వర్షాలకు ముంపునకు గురైన పొలాల్లో పంట నష్టానికి నిజమైన సాగుదారుని పేరు నమోదు చేయాలని వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లో వర్షాలకు, వరదలకు ముంపునకు గురైన పంటలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, వ్యవసాయ, రెవెన్యూ, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు పోయేలా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఈ పంటలో తప్పనిసరిగా సాగుదారుని పేరు నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వరద ద్వారా ముంపునకు గురైన ప్రతి పొలాన్ని పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ శారదా జయలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనసింహ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, వ్యవసాయాధికారులు వెంకట్రావు, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 3: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మూడో రోజు బుధవారం కూడా సెలవు ప్రకటిస్తు కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది వారు పని చేస్తున్న పాఠశాలలకు హాజరు కావాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి తిరిగి పాఠశాలలు పూర్తిస్థాయిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎవరైనా పాఠశాలలు, కళాశాలలు తెరిస్తే సంబంధిత యాజమాన్యాలపై క్రమశిక్షణా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

● అధికారుల పని తీరు భేష్
● నిర్వాసితులకు నాణ్యమైన భోజనం అందించండి
● వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● సమీక్షా సమావేశంలో మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్, మంత్రి రవికుమార్, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 3: అధికారులు మెరుగ్గా పని చేయడంతో వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులతో కలిసి కొల్లూరు కరకట్ట వద్ద నిర్వాసితులకు పడవల ద్వారా ఆహార పదార్థాల సరఫరాను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యాశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్వాసితులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో మంత్రులు, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎంతో బాధ్యతగా పని చేశారని అధికారులు, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి బలోపేతానికి కృషి చేయాలన్నారు. రహదారిపై పడిన గండ్లు పూడ్చాలన్నారు. లంక గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్‌మెన్‌లను పంపించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. 1000 సోలార్ ల్యాంప్‌లు ఇస్తామని చెప్పారు. రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తే ఎలా ఉంటుందో చేసి చూపించారని చెప్పారు. నిత్యవసర సరకులు, వైద్యం సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గతంలో కంటే వరద అధికంగా రావడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురైయ్యాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో కొంతమేరకు ప్రమాదం తగ్గినట్లేనన్నారు. వరద అనంతరం లంక గ్రామాల్లో పేరుకుపోయిన బురద, చెత్తను తొలగించాలని సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. ప్రజలు 24 వేల మందికి పైగా లంక గ్రామాల్లో ఉండిపోయారని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఆహార పదార్థాలను అందించేందుకు 40 మరబోట్లు నడుపుతున్నామని, 200 లైఫ్ జాకెట్లు సిద్ధం చేశామన్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. వరద విపత్తుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ పలు సూచనలు చేశారని చెప్పారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు నిత్యవసర సరకులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఒక కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్, కిలో చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, చేనేతలు, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాల్లో ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవో, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 3: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం కొల్లిపర మండల పరిధిలోని అత్తలూరిపారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను ఆయన పరిశీలించారు. కరకట్ట ఎక్కడైన కోతకు గురైందేమోనని పరిశీలించి ఇరిగేషన్ అధికారులను తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కృష్ణానదికి వరదనీటి ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానది కుడి కరకట్ట 8 చోట్ల కోతకు గురైందనీ, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గేవరకు లంకగ్రామాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. కొత్తూరులంక, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం గ్రామాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పునరావాస కేంద్రాలకు 215 మందిని తరలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ సుమారు 67వేల కుటుంబాలకు 25 కిలోల బియ్యంతోపాటు కిలో చొప్పున కందిపప్పు, పంచదార, లీటర్ పామాయిల్ అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, నాయకులు కొండా శివారెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, బొమ్ము శివరామిరెడ్డి, మొవ్వా వెంకయ్య తదితరులు ఉన్నారు.

సీఐనా.. వైసీపీ కార్యకర్తనా?

● ఇడుపులపాయలో వైఎస్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు
● గతంలో పులివెందులలో జరిగిన జయంతికి కూడా..
● గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా విధులు
● ఓ ఆసుపత్రి వివాదంలో వీఆర్‌కు



వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరరెడ్డి(సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

గుంటూరు, సెప్టెంబరు 3: ఆయన సీఐనా.? లేదంటే వైసీపీ కార్యకర్తనా? అనేది పోలీస్ ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం రేంజ్ వీఆర్‌లో ఉన్న ఐ వెంకటేశ్వరరెడ్డి అనే సీఐ సోమవారం కడప జిల్లాలోని ఇడుపులపాయలో జరిగిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం పోలీస్ శాఖలోనే కాక, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వైఎస్ కుటుంబంపై ఎంత అభిమానం ఉంటే మాత్రం పోలీస్ శాఖలో బాధ్యత కలిగిన సీఐ హోదాలో ఉన్న ఆ అధికారి బహిరంగంగా వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన్ను వైసీపీ ప్రభుత్వం అరండల్‌పేట సీఐగా నియమించింది. అంతకుముందు వైసీపీ ప్రభుత్వంలో ఆయన ఏపీ, తమిళనాడు సరిహద్దు స్టేషన్ సూళ్ళూరుపేటలో ఏకంగా నాలుగేళ్ల విధులు నిర్వహించారు. ఆయన ప్రత్యేకత ఏమిటంటే వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండటమే. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనూ సంబంధాలు ఉన్నాయి. ఏదైనా కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరెడ్డి కనిపిస్తే జగన్ ఆయన్ను అన్నా అని పిలుస్తాడని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చొరవతోనే ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా సూళ్ళూరుపేట సీఐగా విధులు నిర్వహించారు. ఆయన అక్కడ పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఏకంగా సీఎంతోనే పరిచయం ఉందనే ప్రచారంతో పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఆయన విషయంలో పట్టించుకునేవారు కాదని పోలీస్ వర్గాలు అంటున్నాయి. గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా ఆయన వైసీపీ విజయానికి తన వంతు కృషి చేసినట్లు కూటమి పార్టీలు అప్పట్లోనే ఆరోపించాయి. కొరిటెపాడులో జరిగిన జనసేన, వైసీపీ ఫ్లెక్సీల వివాదంలోనూ, అలాగే కొరిటెపాడు సెంటర్‌లో వైసీపీ విగ్రహానికి అవకాశం ఇచ్చి, ఎన్టీఆర్ విగ్రహం పెట్టేందుకు యత్నించిన టీడీపీ వారిని కేసుల పేరుతో బెదిరించడం, పోలింగ్ రోజు బూత్‌ల వద్ద టీడీపీ వారి పట్ల అనుచితంగా ప్రవర్తించడం వంటి అనేక ఏకపక్ష కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఎన్నికల తరువాత అరండల్‌పేటలో ఓ ఐపీఎస్ అధికారి సతీమణి, మరో వైద్యుడికి మధ్య ఓ క్లినిక్ భాగస్వామ్యం విషయంలో వివాదం తలెత్తింది. ఈ విషయంలో ఆయన ఐపీఎస్ అధికారి సతీమణి తరపున రంగంలోకి దిగి వైద్య దంపతుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. పసిపిల్లతో ఉన్న వైద్యురాలి నుంచి రాత్రి సమయంలో సెల్‌ఫోన్ లాక్కొని, కనీసం పసిపాపకు పాలు ఇచ్చే అవకాశం ఇవ్వకుండా నిర్బంధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాధిత వైద్య దంపతులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలోనే సీఐను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న ఆయన ఏకంగా వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇంత బహిరంగంగా ఆయన జగన్ పాల్గొన్న వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం వైసీపీ కార్యకర్తలకే విస్మయాన్ని కలిగించింది. ఆయన పాల్గొన్న ఫొటోను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వైరల్ చేయడం గమనార్హం. ఆయన సీఐనా? వైసీపీ కార్యకర్తనా? అంటూ నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు.

యరపతినేని సేవలపై రైల్వే ప్రశంస

● అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడి



నడికూడి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న నిఖిల్

పిడుగురాళ్ళ, సెప్టెంబరు 3: విపత్కర పరిస్థితుల్లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రయాణికులకు చేసిన సేవలను దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేశాఖకు చెందిన అధికారిక ఫేస్‌బుక్‌లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించిన సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అల్పపీడనం ప్రభావంతో రైళ్లను నడికూడి రైల్వేజంక్షన్ మీదుగా దారి మళ్లించడంతో సుమారు 10 వేల మంది ప్రయాణికులకు ఆయన పాలు, పండ్లు, వెజ్ బిర్యాని అందించారని ఫొటోలతో సహా రైల్వేశాఖ అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడించింది. ఆదివారం మధ్యాహ్నం 15 గంటల నుంచి రాత్రి 22 గంటల వరకు వేలాది మంది రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, పార్టీ శ్రేణులు అందజేశారని రైల్వేశాఖ వెల్లడించింది.

గుంటూరు గర్భిణికి బాంబే బ్లడ్

●దానం చేసిన గుంతకల్లు వాసి



గోపి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న పరుశురామ్

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 3: గుంటూరుకు చెందిన ఓ గర్భిణికి ప్రసవ సమయంలో అవసరమైన ఓ నెగిటివ్ బాంబే గ్రూప్ రక్తాన్ని అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన పరుశురామ్ దానం చేశాడు. గుంటూరు సాయిరత్న ఆసుపత్రిలో ప్రసవం కోసం కస్తూరి అనే మహిళ చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఆమెది అరుదైన ఓ నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు ఆ రక్తం కోసం కర్నూలులోని ఓ రక్తదాతకు సంప్రదించారు. గుంతకల్లులో పరుశురామ్‌ది అదే గ్రూప్ అని తెలుసుకుని.. కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు నుంచి మంగళవారం ఉదయం గుంతకల్లుకు చేరుకున్నారు. పట్టణంలోని గోపీ బ్లడ్ బ్యాంకులో పరుశురామ్ రక్తదానం చేశాడు. ఆ రక్తాన్ని తీసుకుని కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు సాయంత్రం రైలులో బయలుదేరారు. రక్తదానం చేసిన పరుశురామ్‌కు కస్తూరి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

18న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, సెప్టెంబరు 3: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 16న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 17వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 18న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 19వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

హెలికాప్టర్ ద్వారా 21 మంది తరలింపు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని తుళ్లూరు మండలం పెదలంకలో కృష్ణానది వరద ప్రవాహంలో చిక్కుకొన్న 21 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు హెలికాప్టర్ సాయం తీసుకొన్నారు. విడతల వారీగా అందరిని ఎన్‌టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి మంగళవారం తరలించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. గుంటూరు ఆర్‌డీవో పి.శ్రీకర్, ఏఎస్‌పీ కొల్లి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, తుళ్లూరు డీఎస్పీ మల్లికార్జునరావు ఈ ఆపరేషన్‌ని పర్యవేక్షించారు. అలానే ఉద్దండ్రాయునిపాలెంలో 250 మందిని పడవల ద్వారా పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి భోజన సదుపాయం కల్పించారు. 204 పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ నాటు పడవలో ప్రయాణిస్తూ కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెంలో గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తాడేపల్లి మండలంలోని మహానాడు ప్రాంతంలో వరదనీరు చేరిన నివాసాల వద్దకు వెళ్లి ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని విజ్ఞప్తి చేసి ఒప్పించి తీసుకొచ్చారు.

వరద బాధితులకు భాష్యం చేయూత



వరద బాధితులకు ఆహారం అందించేందుకు వెళ్లే వ్యాను వద్ద ఉపాధ్యాయులు, సిబ్బంది

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3: కృష్ణా జిల్లాలో వరద బాధితులకు చేయూత అందించే లక్ష్యంతో భాష్యం విద్యాసంస్థలు తమవంతు వితరణ ప్రకటించాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరద బాధితుల కోసం 70 వేల పులిహోర ప్యాకెట్లు, పెరుగన్నం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలు ఎవరికీ రాకూడదన్నారు. వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో బాధితుల్ని ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు తమ తరుపున స్వయంగా తయారు చేసిన పులిహోర, పెరుగన్నం ప్యాకెట్ల మంగళవారం విజయవాడ తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

వరద భయంతో ఆగిన గుండె



కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో కరకట్టపైనే దహన సంస్కారాలు

తెనాలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటి చుట్టూ ఎటు చూసినా వరద.. బయటపడే మార్గమే లేదు! అప్పటి వరకూ ఇంటి బయటే ఉన్న నీరు ఒక్కసారిగా ఇంటిలోపలికి చొచ్చుకొచ్చింది. క్రమంగా నీటి మట్టం పెరుగుతుండడంతో ఆ కుటుంబం భయపడిపోయింది. దీంతో కుటుంబ పెద్ద కృష్ణారావు(65) మరింత ఆందోళన చెందారు. హఠాత్తుగా గుండె ఆగి తనువు చాలించారు. మరోవైపు దహన సంస్కారాలు చేద్దామన్నా, శ్మశాన వాటిక కూడా వరదలో మునిగిపోవడంతో కుటుంబ సభ్యుల ఆవేదనకు అంతులేకుండాపోయింది. హృదయ విదారకమైన ఈ ఘటన బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో చోటుచేసుకుంది. కృష్ణానది పొంగి ప్రవహించడంతో మండలంలోని ఆవులవారిపాలెం గ్రామం వరదలో చిక్కుకుంది. చుట్టూ నీరు చేరడంతో రెండు రోజులుగా గ్రామస్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం రాత్రి వరద ఉధృతి పెరగడం, ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో కృష్ణారావు తీవ్ర ఆందోళన చెందారు. సురక్షిత ప్రదేశానికి ఎక్కడికైనా వెళ్లిపోదామని భావించినా అక్కడి నుంచి బయటికి తీసుకురాలేని పరిస్థితి. కృష్ణా నది వరద ప్రవాహవేగం ఎక్కువగా ఉండడంతో పడవలను కూడా అధికారులు అనుమతించలేదు. రాత్రి సమయం కావడం, పడవల్లో శ్రేయస్కరం కాదని కుటుంబ సభ్యులు చెప్పినా శాంతించని కృష్ణారావు.. తీవ్ర ఆందోళనకు గురై చివరికి గుండెపోటుతో తనువు చాలించారు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆ బాధను దిగమింగుకుని తండ్రి దేహానికి దహన సంస్కారాలు చేద్దామనుకున్నా చుట్టూ నీరు తప్ప, శ్మశానం కాదుకదా, కనీసం నీరులేని మెరక భూమే కనిపించలేదు. దీంతో దిక్కుతోచక కుమారుడు వెంకటేశ్ అధికారులకు మంగళవారం సమాచారం అందించాడు. వెంటనే అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను లైవ్ బోట్ సాయంతో పంపించి మృతదేహాన్ని గ్రామం నుంచి వరద నీటిని దాటించి కరకట్టపైకి చేర్చగలిగారు. అయితే కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో చివరికి కొల్లూరు-దోనేపూడి మధ్య కృష్ణా కుడి కరకట్టపైనే చితి ఏర్పాటు చేసి దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఈ దృశ్యాలు చూపరులను కూడా కంటతడిపెట్టించాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

42,589 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 45,449 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 42,589 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 21,569 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16000	334	8200	14000
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	8000	13000
273	9600	13000	273	10500	11000
341	8000	14500	341	9500	12500
4884	8900	11500	4884	11000	11500
సూపర్ 10	-	-	సూపర్ 10	12000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	7500	18300
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	13700	దేవనూరు డీలక్స్	10000	16000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	4500	11500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జగన్ అవినీతిపై మాట్లాడే దమ్ము ఉండవల్లికి ఉందా?

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతి గురించి, ఆయన హయాంలో జరిగిన అవినీతి గురించి మాట్లాడే దమ్ము మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఉందా? అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహనరెడ్డి చేసిన అంతులేని అవినీతిపై ఏనాడు నోరు మెదపని ఉండవల్లి, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేయడం తగదని అన్నారు. ప్రతీ సంవత్సరం భారతదేశంలో స్వచ్ఛం దంగా ఆస్తులు - అప్పులు ప్రకటించే ఏకైక రాజకీయ నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కడేనని అన్నారు. జగన్ చేసిన తీవ్రమైన ఆర్థిక నేరాల గురించి మాట్లాడటానికే భయపడే ఉండవల్లి అవినీతి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. డీజీపీ పదవి కోసం జగన్‌తో అంటకాగి తీవ్ర మైన అవినీతి, అరాచకాలకు పాల్పడ్డ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు మంచివాడని కితాబివ్వటం ఉండవల్లికే చెల్లిందన్నారు. వివేకానందరెడ్డి హత్య గురించి కానీ, డాక్టర్ సునీతకు మద్దతుగా గానీ ఆయన ఏరోజైనా ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలతో ఎన్నికల్లో జగన్ గెలుపు ఖాయమని నాడు చెప్పిన ఉండవల్లి ఇకనైనా తన చిలక జోస్యాలు మానుకోవాలన్నారు.

వరద వేళ బురద రాజకీయమా జగన్‌రెడ్డీ?

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరదల్లో ప్రజలు ఇబ్బందుల పాలై వుంటే జగన్‌రెడ్డి బురద రాజకీయాలు చేయడమేంటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ప్రశ్నించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో ఆయన చేతగానీతనం వల్లే ఈరోజు విజయవాడకు వరద కష్టాలు తలెత్తాయని అని విరుచుకుపడ్డారు. వైసీపీ పాలనలో బుడమేరు వాగులో సిల్ట్ తొలగించడం, ఎక్స్‌టెన్షన్ వంటి పనులు చేపట్టకపోవడంతోనే వాగుకు గండ్లు పడ్డాయని, విజయవాడ నగరం అతలాకుతులైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాల్సిన జగన్‌రెడ్డి బురద రాజకీయాలు చేస్తూ ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఆపన్నులకు సహాయం చేయకపోగా విష ప్రచారాలు, శవ రాజకీయాలు, కుట్రలు చేసే జగన్ తన పద్ధతి మార్చుకోకపోతే మరింత ప్రజాగ్రహానికి గురికాక తప్పదని అన్నారు.

వైసీపీకి సిగ్గు చేటు : షేక్ అబ్దుల్ గని

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. వైసీపీ నాయకులు కొందరు ఇంకా ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించడం సిగ్గుచేటని టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గని మంగళవారం ఒక ప్రకటనలో విమ ర్శించారు. సీఎం చంద్రబాబు ఇల్లు మునిగిపోయింది, రాజధాని మునిగి పోయిందని ఇంకా సిగ్గు లేకుండా ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. కేవలం రాజధాని అమరావతిపై విషం వెళ్లగక్కడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

బురదజల్లే రాజకీయాలు మానుకోండి

● ఏపీ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3: వరద బాధితులకు అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై బురదజల్లే రాజకీయాలను మానుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి ఏపీ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ హితవు పలికారు. స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల రాష్ట్రాభివృద్ధి గాలికి వదిలేసి తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులకు చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. రెండు రోజులుగా అధికార యంత్రాంగంతో కలిసి చంద్రబాబు కష్టపడుతున్న దృశ్యాలు జగన్‌కు కనిపించకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. ఇకనైనా బురదజల్లే రాజకీయాలు మానుకుని సహాయక చర్యలలో పాల్గొనాలని జగన్‌కు హితవు పలికారు. సమావేశంలో ఎం.రాజారావు, కే.రోజ్‌కుమార్, వై.పవన్, కే ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

● కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరద పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ



తాడేపల్లి కృష్ణా పుష్కరఘాట్ వద్ద భద్రతా ఏర్పాట్లను సీఐ వినోద్‌కుమార్‌ను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 3 : లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తాడేపల్లి పరిధిలోని కృష్ణానది పరీవాహక ప్రాంతంలో పర్యటించారు. తాడేపల్లి-సీతానగరం కృష్ణానది పరీవాహక ప్రాంతం పుష్కర ఘాట్, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వరదబాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వరద ముంపునకు ఉన్న అవకాశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి అధికారులకు చెప్పారు. ప్రజలు పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా విపత్కర సమయం ఎదురైతే వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8688831568కు ఫోన్ చేయాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం రెవెన్యూ శాఖ సహకారంతో పునరావాస కేంద్రాల వద్ద ప్రజలకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. వరద ఉధృతి తగ్గేవరకు అనవసర ప్రయాణాలు చేయవద్దని, పొంగిపొర్లుతున్న వాగులు వంకలను దాటి వెళ్లే ప్రయత్నం కూడా ఎవరు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో మంగళగిరి టౌన్ సిఐ వినోద్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాసరావు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 3 : గుంటూరు నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుడంపాడులోని పలు ప్రాంతాలను, రిజర్వాయర్‌ని మంగళవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా విలీన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని చెప్పారు. బుడంపాడు చెరువు వైపు నివాసాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్న స్థానికుల అభ్యర్థన మేరకు తక్షణం ప్యాచ్ వర్క్ చేపట్టాలని ఆదేశించారు. రిజర్వాయర్‌లో మోటర్లు సరిగా పని చేయకపోవడం వలన పూర్తి స్థాయిలో నీటి సరఫరా సాధ్యం కావడం లేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కొండారెడ్డి, డిసిపి శ్రీనివాస్, ఏసీపి అజయ్ కుమార్, టిపిఎస్ సువర్ణ కుమార్, ఏఈలు రవి కిరణ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ ఇబ్బంది పెడుతున్నారు

● బీసీ వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాధవితో విద్యార్థినులు

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఆడపిల్లల భద్రతకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తున్నదని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మంగళవారం స్థానిక స్టాల్ హైస్కూల్ బీసీ వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. హాస్టల్లోని విద్యార్థినులను వేధిస్తున్నారని నగరపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆమె క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. విద్యార్థినులతో మాట్లాడి విషయం అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్లుగా ఇలాగే జరుగుతోందని, గంజాయి బ్యాచ్ నేరుగా వసతి గృహంలోకి వచ్చి తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే ఎదుట విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు వస్తున్నాయని, ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదని, మరుగుదొడ్లకు సరైన తలుపులు లేవని, వార్డెన్, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గంగానమ్మ దేవస్థానంలో ముగిసిన శ్రావణ మాస మహోత్సవాలు

గుంటూరు, సెప్టెంబరు 3: పాతగుంటూరు బిఆర్ స్టేడియం ఎదుట ఉన్న గంగానమ్మ దేవస్థానంలో శ్రావణ మాస 35వ వార్షిక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా అంగరంగ వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం దేవస్థానంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈమని ఉమామహేశ్వరరావు, గుంటూరు నరసింహం తదితరులున్నారు.

వరద నష్టాన్ని త్వరగా లెక్కించాలి

● కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశాలు



వరద సాయంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల వలన జిల్లాకు జరిగిన నష్టాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు త్వరగా లెక్కించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లాలో వరద పరిస్థితులు, తీసుకుంటున్న సహాయక చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీలలో కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి 11.4 లక్షల క్యూసెక్కుల నీరు రాగా, మంగళవారం సాయంత్రానికి 7.25 లక్షల క్యూసెక్కులకు తగ్గిందని అన్నారు. ఈ నెల 3, 4, 5 తేదీలలో మోడరేట్‌గా 65 మిల్లీ మీటర్ల వర్షాలు పడే అవకాశం వుందని అన్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో పడే వర్షపు నీరు కృష్ణా నదికి రావచ్చని అందువల్ల వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ అప్రమత్తంగా వుండాలన్నారు. నీట మునిగిన ప్రాంతాల కాలనీలలో నీరు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఇప్పటికే వరద వల్ల ఏడుగురు చనిపోయారని, ఇక ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని అన్నారు. తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బంది, చిరుద్యోగులకు డ్యూటీలు వేసి జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వరదలకు ప్రభావితమైన కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, చక్కెర, పామాలిన్ ఆయిల్, బంగాళాదుంపలు, ఉల్లిపాయాలను ఒక కిట్‌గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన లెక్కింపు పూర్తి చేసి మంగళవారం సాయంత్రం నుంచే కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు, వీవర్స్ కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించాల్సి వుందన్నారు. ఈ వరదల వల్ల సంభవించిన పశు మరణాలను లెక్కించాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లోని పశువులకు పశుగ్రాసం సరఫరా, వరద నీరు తగ్గుముఖం పడుతున్నందున ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యకాలువల పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో చనిపోయిన ఏడుగురికి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల ప్రకారం ఎక్స్‌గ్రేషియా అందించాల్సి వుందన్నారు. వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న ఆటోలు, తోపుడు బండ్లను ఎన్యుమరేట్ చేయా లని, హ్యాండ్‌లూమ్ మగ్గాలు, మెటీరియల్, తయారైన వస్త్రాలకు వరదల వల్ల నష్టం సంభవిస్తే వాటిని కూడా లెక్కించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, కాలువ కట్టలు రెస్టోరేషన్ కు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని 8200 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేశామని, వాటిని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సిద్ధంగా వుంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గనుల పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

● ఉప రవాణ కమిషనర్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3 : ఇసుక రవాణా చేసే లారీ యజమానులు తప్పనిసరిగా గనుల పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉప రవాణ కమీషనర్ షేక్ కరీం స్పష్టం చేశారు. మంగళవారం డీటీసీ కార్యాలయంలో గనుల శాఖ అధికారులు, లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన నియమాల ప్రకారం విధిగా గనుల పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, లేనిపక్షంలో ఇసుక రవాణాకు అనుమతి నిరాకరిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 12లోగా వివరాలు నమోదు చేసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక ఆర్టీవోను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఆర్టీవో గోపాల్, గనుల శాఖ జిల్లా అధికారి చంద్రశేకర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తులకు గడువు పొడిగింపు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3: ఈ ఏడాది డిసెంబరులో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌సిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకునే గడువు ప్రభుత్వం పొడిగించినట్లు డిఇవో పీ శైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు దరకాఖాస్తు చేసుకునే తేదీని ఈనెల 17వ తేదీ వరకు పొడించినట్లు తెలిపారు. జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలలో(వసతి సౌకర్యం లేని) 8 వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3,50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో చూడాలని వివరించారు.

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో వరదనీరు తొలగింపు పూర్తి

● ప్రారంభమైన బస్సుల రాకపోకలు

గుంటూరు, సెప్టెంబరు 3: స్థానిక ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో వరద నీటిని పూర్తిస్థాయిలో తొలగించారు. ఈ వరద నీటిని తొలగించేందుకు మూడు రోజుల పాటు ఏడు ప్రత్యేక మోటార్లను వినియోగించారు. మంగళవారం మధ్యాహ్నం నాటికి పూర్తి స్థాయిలో వరద నీటిని తరలించాక బస్సుల రాకపోకలను ప్రారంభించారు. వరద నీరు తొలగింపు పనులను జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్ పరిశీలించారు. అనంతరం బస్సుల రాకపోకలకు అనుమతించారు. గుంటూరు-1, 2 డిపో గ్యారేజ్‌లలో మాత్రం వర్షపు నీటి నిల్వలు ఉండటంతో వాటిని తొలగించే పనుల్లో ఉన్నారు.

'సింగిల్ విండో' సరిగా అమలు కావట్లేదు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 3 : వినాయక చవితి వేడుకల అనుమతిని సులభతరం చేసే ఉదేశ్యంతో తీసుకువచ్చిన సింగిల్ విండో విధానం జిల్లాలో సరిగా అమలు కావడం లేదని హిందూ ఐక్య పోరాట వేదిక, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికా రుల నిర్లక్ష్యం కారణంగా ఈ విధానం వల్ల మంచి జరగకపోగా, అనేక ఇబ్బందులకు, గందరగోళానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉందని ఆరోపించారు. ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హిందూ ఐక్య పోరాట వేదిక అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ, ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ బెహరా, విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత జిల్లా అధ్యక్షుడు పి.మాధవ శర్మ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి నాని మాదిగ, టి.పవన్ కుమార్ శర్మ, సత్య చందు డిమాండ్ చేశారు.

మాతృశ్రీ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలో ముందస్తు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మాతృశ్రీ వృద్ధాశ్రమంలో డేగల యూత్, డేగల ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభాకర్ భార్య డేగల భువనేశ్వరితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. వృద్ధులకు పండ్లు, అన్నదానం చేశారు. ప్రభాకర్ చిత్రపటానికి ఆశ్రమంలోని వృద్ధులు క్షీరాభిషేకం చేశారు. రానున్నరోజుల్లో డేగల ప్రభాకర్ ఉన్నతమైన పదవులను అలంకరించాలని తాడివాక సుబ్బారావు, తాడివాక తేజ ఆకాంక్షించారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న డేగల ప్రభాకర్ భార్య భువనేశ్వరి

భక్తి శ్రద్ధలతో కోటికుంకుమార్చన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3: స్థానిక అరండల్‌పేటలోని శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రావణ మాస పూజలు ముగిశాయి. చివరి రోజున శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాలలో భాగంగా ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం అమ్మవార్లకు లక్ష గాజులతో అభిషేక పూజలు నిర్వహించారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నారాయణ దాస జయంత్యుత్సవాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3 : శ్రీ నారాయణ దాస 160వ జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం 'హరికథలు పట్టు - ఆది భట్ల 'అనే అంశంపై శ్రీ శ్రిష్టి లక్ష్మీకుమార్ ఉపన్యాసం చేశారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కళ్యాణవేదికపై శ్రీ మదజ్జాదాది భట్ల నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

వరద బాధితులకు 'అక్షయ పాత్ర' విరాళం

గుంటూరు, సెప్టెంబరు 3: వరద ముంపుతో విజయవాడలోని లోతట్టు ప్రాంతాల వాసులు ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గుంటూరు నగరానికి చెందిన రాయపాటి కోటి సుధాకర్, శివ కుమారి దంపతులు లక్ష మంది భోజనాలకు సరిపడా వంటల్లో ఉపయోగించే కారం విరాళంగా అందించారు. మంగళగిరిలోని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులను మంగళవారం కలసి వంటకు ఉపయోగించే కారం అందించారు. అక్షయ పాత్ర సంస్థ ద్వారా వరద బాధితులకు నాణ్యమైన ఆహారం అందజేస్తున్నారని, ఈ మహత్తర కార్యక్రమంలో తమ వంతు సాయంగా దీనిని ఇవ్వడం సంతృప్తి కలిగించిందని దాతలు కోటి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ప్రతినిధులు విలాస్, రామదాసు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.22,222

వరద బాధితుల సహాయార్థం పొగాకు బోర్డు విశ్రాంత అధికారి రావెళ్ల లక్ష్మయ్య తన మనుమరాలు సమీరా చౌదరి పుట్టినరోజు సందర్భంగా రూ.22,222ను సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా చెక్ ద్వారా అందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖులతో పాటు విదేశాల్లో ఉన్న వారు కూడా ఆపదలో ఉన్న వరద బాధితులను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఆరుద్ర రచనలు భావితరాలకు స్ఫూర్తి

గుంటూరు, సెప్టెంబరు 3: ఆరుద్ర రచనలు భావితరాలకు స్ఫూర్తి అని మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సాహితీవేత్త ఆరుద్ర జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ ఆకాశంలో ఆరుద్ర వెతికిచూడని మలుపు, పరిశోధించకుండా వదిలిన అంశం లేదన్నారు. ఆరుద్ర ప్రతిభ బహుముఖమని, ఆయన లాంటి సాహిత్య మూర్తి తెలుగు సాహిత్యంలో మరొకరు లేరని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ముప్పాళ్ళ ప్రసాదరావు, మొగిలి, ఘనశ్యామాచార్యులు, జయరామ్ ఉన్నారు.

జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 3 : జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు... లాలాపేట ఎస్‌ఐ ఎం.సుబ్బారావును, నల్లపాడు ఎస్సై డీ ప్రవీణ్‌ను తాడేపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పాతగుంటూరు ఎస్‌ఐ పి.భాగ్యరాజ్‌ను తాడేపల్లి స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న కె.శ్రీనివాసరావును లాలాపేటకు, పి.వెంకటేశ్వర్లును పాతగుంటూరు స్టేషన్‌కు బదిలీ చేశారు.


చికిత్స పొందుతూ యువతి మృతి

గుంటూరు, సెప్టెంబరు 3 : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్డులో గల రామా బిల్డింగ్స్ ప్రాంతానికి చెందిన యువతి చిలక కావ్య (24) ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందింది. అరండల్ పేట సీఐ కె శ్రీనివాసరావు కథనం మేరకు వివరాల ప్రకారం.. అమరావతిరోడ్డులోని రామా బిల్డింగ్స్ వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న కావ్య.. పేరేచర్ల సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదివింది. ప్రస్తుతం ఓ బ్యాంకులో లోన్స్ సెక్షన్‌లో ఆమె విధులు నిర్వహిస్తోంది. అదే కళాశాలలో బీటెక్ చదివిన తన క్లాస్‌మేట్ సత్తెనపల్లి పరిధిలోని ఎర్రగుంట్లపాలెంకు చెందిన ఆళ్ల గోపినాథ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. వేర్వేరు కులాలకు చెందిన వాళ్లిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో లోన్స్ విభాగంలో గోపీనాథ్ విధులు నిర్వహిస్తున్నాడు. తమ పెళ్లి చేయాలని వాళ్లిద్దరూ తమ కుటుంబ సభ్యులకు చెప్పారు. అయితే, వీరి పెళ్ళికి గోపీనాథ్ ఇంట్లో అంగీకరించలేదు. అయినపపటికీ ఈ విషయమై కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే గత నెల 28న నగరంలోని కొరిటెపాడులోని గోపీనాథ్ పిన్ని ఇంటిలో జరిగిన పుట్టినరోజు వేడుకలకు కావ్య హాజరైంది. అక్కడ వారి పెళ్లి ప్రస్తావన రావడం, అందుకు గోపీనాథ్ పిన్ని, వారి కుటుంబసభ్యులు నిరాకరించడం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కావ్య వారి ఇంటి ముందే ఎలుకలు మందు తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు ఆమెను తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉండడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. ఈ మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటో స్టూడియోలో కెమెరాల అపహరణ

గుంటూరు, సెప్టెంబరు 3 : స్థానిక అరండల్‌పేట 8/2లో సోమవారం అర్ధరాత్రి ఫొటో స్టూడియోలో చోరీ జరిగింది. సుమారు రెండు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏవి ఫోటో స్టూడియో తాళాలు పగల కొట్టి సుమారు రూ.4 లక్షల విలువ చేసే 5డీ కెమెరాలు, లెన్స్‌లు అపహరించారు. స్టూడియో తాళాలు పగలగొట్టి ఉండటం గమనించిన పక్క షాపు వాళ్లు, ఈ విషయాన్ని స్టూడియో యజమాని కుమారుడు వెంకటేష్‌కు తెలిపారు. షాప్ యజమాని నీరుకొండ రామారావు ఈ మేరకు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం



కుమారుడితో తల్లి రిజ్వానా

గుంటూరు, సెప్టెంబరు 3 : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెంకు చెందిన పఠాన్ రిజ్వానా తన కుమారుడు పఠాన్ అయాన్ అహ్మద్ ఖాన్ (8)తో అదృశ్యమైంది. ఇంటి నుంచి వెళ్ళిన రిజ్వానా తిరిగి రాలేదని నల్లపాడు పోలీసులు తెలిపారు. వారి ఆచూకీ తెలిసిన వారు 8688831376 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రైల్వే స్టేషన్ ముందు గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేసన్ ముందు గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో గుంటూరు రైల్వే స్టేషన్ ముందు చనిపోయి ఉండగా, రైల్వే హౌస్ కీపింగ్ సిబ్బంది గుర్తించి తగు చర్య నిమిత్తం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 8688831320, 0863- 2221815, 112 నంబర్లలో తెలియజేయాలని పోలీసులు కోరారు.



ఆహార సరఫరా వాహనానికి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే నసీర్

వరద బాధితులకు అండగా ఉంటా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెం బరు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు అండగా వుంటా నని గుంటూరు తూర్పు నియో జకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీ ర్ అన్నారు. విజ యవాడ వరద బాధి తులకు మంగళవారం ఆయన 11,000 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్యాటరింగ్ అసోసియేషన్, ఆర్యవైశ్యుల అసోసియేషన్స్ సహకారంతో 50 వేల వాటర్ బాటిళ్లు, ఒక ఆటో బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడ వరద బాధితులకు అందజేశారు. గుంటూరు నుంచి బయలుదేరిన ఆ వాహనాలకు ఆయన పచ్చ జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కోట శేషగిరి మణికంఠ ప్రసాద్, సాగర్, బైసాని కిరణ్, శ్రీను, సాంబశివరావు, పద్మనాభం, కొనకళ్ల సత్యం, కరిముల్లా, ఆంజనేయ ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

విజయవాడలో సహాయక చర్యల్లో పాల్గొన్న నసీర్

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడ 1, 5, 7 డివిజన్లలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఇళ్లలోకి నీరు వచ్చి వంట చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్న నిరాశయులు 5000 మందికి ఆయన నేతృత్వంలో భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. విజయవాడ ఒకటో వార్డులోని కొన్ని కాలనీలకు ఆయన పడవలో వెళ్లి అక్కడ పరిస్థితులను గమనించారు. స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే కొవ్వొత్తులు, మస్కిటో కాయిల్ మంగళవారి రాత్రికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట సీనియర్ ఐఏఎస్ అధికారి కన్నబాబు, అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

వరద బాధితులకు బాసటగా నిలుద్దాం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



భోజనం ప్యాకెట్ల సరఫరా వాహనానికి జెండా ఊపుతున్న గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్ర జ్యోతి): విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న బాధితు లకు బాసటగా నిలవాలని గుం టూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపుని చ్చారు. టీడీపీ యు వనేత, మంత్రి నారా లోకేశ్ పిలుపు మేరకు ఆమె విజయవాడ వరద బాధితులకు శ్రీ భ్రమర ట్రస్ట్ అధినేత గళ్లా రామచంద్రరావు సహకారంతో అన్నార్తులకు 10,000 భోజన ప్యాకెట్లు, 'ది గుంటూరు హోటల్ అసోసియేషన్ అండ్ క్యాటరింగ్ అసోసియేషన్' 20,000 వాటర్ బాటిళ్ల సరఫరా చేశారు. మంగళవారం ఉదయం ఆ వాహనా లకు ఆమె పచ్చ జెండా ఊపి విజ యవాడ పంపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండురోజుల నుంచి విజయవాడలోనే ఉంటూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారన్నారని ప్రజలు కంగారుపడవద్దని కోరారు. కార్యక్రమంలో ముత్తినేని రాజేష్,మండలపు బంగారు బాబు,వై. సాంబశివరావు, పి.సుబ్రమణ్యం, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో నిత్యావసరాల పంపిణీ

స్థానిక 43వ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ వద్ద వరద ప్రభావిత ప్రాంత వాసులకు కిలారు వెంకటయ్య అండ్ కొమ్మినేని సీతారామ య్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి, కనపర్తి శ్రీనివాసరావు, కె.శివ కోటేశ్వరరావు, ఆదినారాయణ, ప్రసాద్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 50 వేలమందికి భోజనాలు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 3 : విజయవాడలోని వరద బాధితుల కోసం జిల్లా పౌర సరఫరాల శాఖ ప్రతిరోజు 50 వేల మందికి భోజనాలు సిద్ధం చేస్తోంది. గుంటూరు, తెనాలి, మంగళగిరిలో ఆహార పదార్థాలను తయారు చేసి ప్రత్యేక వాహనాల ద్వారా బాధితులకు చేరుస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో తుఫాను బాధితులకు కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ పంచదార, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు అందజేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలలో చేనేత కార్మికులు, మత్స్యకార కుటుంబాలు ఉంటే కనుక వారికి 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసరాలను అందిస్తామన్నారు.

వరద బాధితులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి : కమిషనర్



బాధితులకు ఆహార పదార్థాలను పంపిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 3 : విజయవాడ నగరంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు గుంటూరు నగరపాలక సంస్థ తరపున అందిం చే ఆహార పదార్థాలను తయారు చేసే క్యాట రింగ్ ఏజెన్సీలు నాణ్య మైన సరుకులను విని యోగించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని తయారు చేసి అందించేలా పర్యవేక్షణా అధికారులు శ్రద్ధ చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్ నుంచి విజయవాడకు పంపుతు న్న లక్ష ఆహార, అల్పాహార పదార్థాల ప్యాకెట్స్, వాహనాలను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ నుంచి మంగళవారం టమా టా బాత్, వెజ్ బిర్యాని, సాంబార్ అన్నం, పెరుగన్నం, పాలు, బిస్కెట్స్, వాటర్ బాటి ల్స్ బ్రెడ్ ప్యాకెట్లను ఒక పూటకు లక్ష చొప్పున అందిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏఈలు సునీల్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

భారీ వర్షాలు, వరదల వలన తీవ్రంగా నష్ట పోయిన ప్రజలకు అండగా నిలిచేందుకు దాతలు ముందుకు రావాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దాతల నుంచి నగదు లేదా వస్తువుల సేకరణకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నిర్దేశిత గడవులోగా ప్రతి రిజర్వాయర్‌ను శుభ్రం చేయాలి

గుంటూరు నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ప్రస్తుత వర్షాల కారణంగా నీటిని అధిక ప్రాధాన్యతాక్రమంలో ఫిల్టర్ చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక నాజ్‌సెంటర్‌లోని రిజర్వాయర్లను మంగళవారం ఈఈ కోటేశ్వరరావుతో కలిసి వాటిపైకి వెళ్లి పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం కృష్ణా నదీలో వరద వస్తున్నందున ప్రజలకు అందించే తాగునీటిని మరింత ఫిల్టర్ చేయాలని, హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు ప్రతి రిజర్వాయర్ దగ్గర త్రాగునీటిని సరఫరాకి ముందు క్లోరిన్ శ్యాంపిల్స్ చెక్ చేయాలన్నారు.

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ



పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లి గూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.



- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- ★ **ఈ-మెయిల్:** hdadmissions@nitandhra.ac.in
- ★ **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in

దిక్సూచి DIKSUCHI

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్‌ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.

- సీఎస్‌ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్‌ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.



- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zqexLBVలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం







ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా అయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు... డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. మున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పౌలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

కొత్తగా..

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తుపాకులతో పోలీసు బందీ



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం..

● పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



లింగాయపాలెం బీసీ కాలనీలో వర్షపు నీటిని నీళ్ల ఇంజన్ల ద్వారా బయటకు పంపుతున్న పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 3: వరద బాధితులు అధైర్య పడవద్దని అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలంలో మంగళవారం ఆయన లంక గ్రామాల ప్రజల పునరావాస కేంద్రాలను సందర్శించారు. రాయపూడి ఫిషర్‌మెన్ కాలనీవాసులను పరామర్శించారు. నిత్యావసర సరుకులను అందజేస్తామని చెప్పారు. వరద తగ్గుముఖం పట్టిందన్నారు. విపత్తు నుంచి బయట పడుతున్నామన్నారు. లింగాయపాలెం, వెంకటపాలెం, ఉద్దండ్రాయునిపాలెం రాయపూడి తాళ్లాయపాలెం పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించి ఆహారం సరఫరా గురించి తెలుసుకున్నారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లంక గ్రామాల్లో ఉన్న వారిందని ఒడ్డుకు చేర్చామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అన్ని శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కూటమి నేతలు ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంటారని ఏ అవసరం వచ్చినా ప్రజలు వారిని సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న వరద సహాయక చర్యలు



రాయపూడి పెదలంక నుంచి సురక్షింతంగా హెలీకాప్టర్‌లో పునరావాస కేంద్రానికి వచ్చిన వరద బాధితులు

తుళ్లూరు, ఆగస్టు 3: మండలంలో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రాయపూడి పెదలంక వరదల్లో చిక్కుకున్న ఉదయం 62 మందిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పడవల ద్వారా కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పునరావాస కేంద్రాలకు తరలించారు. సాయంత్రం హెలీకాప్టర్ ద్వారా 21 మందిని తరలించారు. పునరావాస కేంద్రాల్లో అధికారులు భోజన సదుపాయం కల్పించారు.

ఇస్కాన్ కృష్ణ మందిరంలోకి వరద నీరు



ఇస్కాన్ కృష్ణమందిరంలోకి ప్రవేశించిన వరదనీరు

తాడేపల్లి, సెప్టెంబరు 3: ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరంలోకి వరదనీరు ప్రవేశించింది. అనుకోని రీతిగా కృష్ణమందిరం వద్ద ఉన్న 8 అడుగుల కాంపౌండ్ గోడ దాటి సోమవారం రాత్రి హఠాత్తుగా వరదనీరు మందిరంలోకి ప్రవేశించడంతో మందిరంలోని లక్షల విలువచేసే ఆధ్యాత్మిక గ్రంథాలు, ఫర్నిచర్ నీటిలో నాని పాడైపోయాయి. కాగా రాధాశ్యామసుందర దేవాలయం పూర్తిగా జలమయమైనప్పటికీ వరద బాధితులకు అన్నదానం, ప్రసాద వితరణ కొనసాగుతూనే ఉందని మందిర అధ్యక్షులు చక్రధరీదాస్ తెలిపారు. స్వామి వారికి సేవలు కూడా యథావిధిగా జరుగుతున్నాయన్నారు.

ఆక్టోపస్ సిబ్బందిచే సేవా కార్యక్రమాలు

తాడేపల్లి, సెప్టెంబరు 3: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ఆక్టోపస్ కార్యాలయ సిబ్బంది, అధికారులు విజయవాడలోని వరద బాధితులకు విస్తృత సేవలు అందిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో నిర్విరామంగా సహాయ సహకార చర్యల్లో పాల్గొంటున్నారు. ఆక్టోపస్ అడిషనల్ డీజీ ఆర్‌కె మీనా ఆధ్వర్యంలో డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ ఎం నాగేంద్రరావు, బి.రవిచంద్ర, అధికారులు శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షణలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే కాక ఆహార పానీయాలు అందిస్తూ సేవలు అందిస్తున్నారు.

వెద వరిసాగు పైరుకు ఇబ్బందే

● నీరు పోయిన వెంటనే యూరియా, తెగుళ్ళ మందులు పిచికారి చేయాలి ● డాట్ శాస్త్రవేత నగేష్



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నగేష్, వ్యవసాయాధికారులు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 3: వరద ముంపు కారణంగా గత నాలుగు రోజులుగా నీట మునిగియున్న ఎద వరిపైరు, దెబ్బతినే ప్రమాదం ఉందని, నీరు బయటకువెళ్లిన వెంటనే యూరియా, తెగుళ్ల మందులు పిచికారితో కొంతమేర వరిపైరు దక్కే అవకావం ఉన్నదని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, ల్యాం శాస్త్రవేత ప్రతిభ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రం వట్టిచెరుకూరు, కోవెలమూడి, ముట్లూరు, కారంపూడిపాడు గ్రామాల ఆయకట్టు పరిధిలో వరదనీటిలో మునిగియున్న ప్రాంతాలను మంగళవారం క్షేత్రస్థాయిలో మండల ఏవో కె.లక్ష్మీ ఆయా గ్రామాల ఏఈవోలు, రైతులతో కలిసి పరిశీలించారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏవో లక్ష్మీ మాట్లాడుతూ వట్టిచెరుకూరు, ముట్లూరు, కారంపూడిపాడు, కోవెలమూడి ప్రాంతంలో నాలుగు రోజులుగా 1480 హెక్టార్లలో వరి, చమళ్ళమూడి పరిధి 30 ఎకరాల్లో మినుము, కొర్నెపాడు పరిధిలో 3వందల ఎకరాల్లో ప్రత్తి వింజనంపాడు పరిధిలో 10ఎకరాలు, అనంతవర్పాడు పరిధిలో 10 ఎకరాల్లో ప్రత్తిపైరు వరద ముంపునకు గురైనట్లు గుర్తించామని, త్వరలో రైతుల వారిగా పంటల వివరాలు, దెబ్బతిన్న పంటల వివరాల జాబితాలను రూపొందిస్తున్నామన్నారు.

వరద బాధితుల సహాయార్థం భోజన ప్యాకెట్ల పంపిణీ



భోజన ప్యాకెట్లు పంపిస్తున్న టీడీపీ నేత కాట్రగడ్డ మధు

తాడేపల్లి, సెప్టెంబరు 3: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు మంగళవారం తాడేపల్లికి చెందిన వరద బాధితుల సహాయార్థం 1000 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భోజన పంపిణీ వాహనాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ నేత కాట్రగడ్డ మధు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాధితుల సహాయర్థం తన వంతుగా 1000 భోజన ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ మధుసూదన రావు, మద్దినేని సుబ్రహ్మణ్యం, వాణి, మౌనిక, కరీమా, కరీమున్నీసా, మస్తాన్, లక్ష్మి, వలి, గోపాలకృష్ణయ్య, భీముడు, కత్తిక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో తహసీల్దార్ కార్యాలయం

● వర్షం వస్తే చిత్తడిగా కార్యాలయం
● వర్షానికి తడిచిపోతున్న రికార్డు రూమ్‌లోని ఫైల్స్
● పూర్తిగా పాడైపోయిన జనరేటర్
● శ్లాబు నుంచి కారుతున్న వర్షం నీరు
● కూర్చోవటానికి స్థలం లేక వీఆర్‌వోల అవస్థలు





వర్షం నీటికి తడిచిపోయిన రికార్డులు

తాడికొండ సెప్టెంబరు 3: తాడికొండలోని తహసీల్దార్ కార్యాలయం సమస్యలకు నిలయంగా ఉంది. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా పాడైపోయింది. గోడలు నెర్రెలిచ్చి కనపడుతుంది. ఫ్లోరింగ్ దెబ్బతి న్నది. మూడు, నాలుగు సార్లు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోయింది. డిప్యూటి తహసీల్దార్, ఉద్యోగులు పనిచేసే భవనానికి రెండు సంవత్సరాల క్రితం శ్లాబ్‌కు మరమ్మతులు చేయించారు. ఫ్లోర్ బాగు చేయించినా.. అక్కడక్కడా పెచ్చులు ఊడి కనిపిస్తుంది. రికార్డు రూమ్స్, ఆర్‌ఐ రూంలో వర్షం నీళ్ల శ్లాబు నుంచి కారుతున్నాయి. కారిడార్ మొత్తం వర్షం నీళ్లు కారుతున్నాయి. రికార్డు భద్రపరిచే గదిలో వర్షం నీళ్లు కారటంతో ఫైల్స్ అన్ని తడిచిపోయాయి. శ్లాబు నుంచి నీటి చుక్కలు పడుతూనే ఉండటంతో వీఆర్‌వోలు ఎక్కడ కూర్చోవాల్లో తెలియక కార్యాలయంలోని చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి. తహసీల్దార్ కూర్చునే గదిలో గోడలు నెర్రెలిచ్చాయి. శ్లాబు, గోడ పెచ్చులూడిపోయాయి. తహసీల్దార్ గదిలో శ్లాబు పెచ్చులు పడకుండా సీలింగ్ చేయించారు. ఆ సీలింగ్ పాక్షికంగా ఊడిపోయింది. రికార్డును భద్రపరిచే గదిలో శ్లాబులు ఊడిపోయి, వర్షం పడినప్పుడు గోడల్లోకి చెమ్మదిగి రికార్డులు తడిచిపోతున్నాయి. ఇతర ఉద్యోగులు కూర్చునే గదులు మరింత దుస్థితిలో ఉన్నాయి. అయితే ఈ భవనానికి పక్కనే ఉన్న మరో భవనంలో రెవెన్యూ సిబ్బంది వినియోగించుకుంటున్నారు. ఆ భవనంలో వీడియో కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ కార్యాలయం దయనీయ స్థితిలో ఉండగా ఇప్పటికే ఐదారు సార్లు ప్రతిపాదనలు పంపినా నూతన భవన నిర్మాణంపై ఉన్నతాధికారులు దృష్టి సారించటం లేదని అధికారులు చెప్తున్నారు. 2016 సంవత్సరంలో రూ.60 లక్షలు నూతన భవనానికి మంజూరైనా కొన్ని కారణాల వల్ల నిధుల వేరే మండలానికి బదిలీ చేశారు. దీని వల్ల కేవలం చిన్న పాటి మరమ్మతులతోనే కార్యాలయంలో బాగుచేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే బాగుంటుందని రెవెన్యూ సిబ్బంది మాట్లాడుకుంటున్నారు.

వరద బాధితులకు అండగా మంత్రి నారా లోకేశ్

● వందలాది కుటుంబాలకు కూరగాయలు పంపిణీ
● మాజీ ఎమ్మెల్యేల సహకారంతో మరో 8 టన్నులు
● ముంపు ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు



ముంపు బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో వరద బాధితులకు అండగా నిలిచారు. మంత్రి లోకేశ్ సహకారంతో పట్టణంలోని 5, 6, 9 వార్డులలో నిరాశ్రయులైన 400 కుటుంబాలకు స్థానిక నేతల ద్వారా కూరగాయల ను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెం టు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ముంపు ప్రాంతాలపై మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసర మైన సహాయక చర్యలను చేపడుతున్నారని తెలిపారు. వరదల కార ణంగా జీవనోపాధి కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునివ్వడంతో పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ నాలుగున్నర టన్నుల కూరగాయలను కొనుగోలు చేసి ప్రత్యేక వాహనం ద్వారా మంగళగిరికి పంపించారు. వరద ప్రభావిత ప్రాంతమైన రత్నాలచెరువు 21వ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బాధితులకు కూరగాయలను పంపిణీ చేశారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే జీ శంకర్ యాదవ్ మూడున్నర టన్నుల కూరగాయలను కొనుగోలు చేసి పంపించగా, మంగళగిరి రత్నాల చెరువులోని 22వ వార్డులో టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ సేవా దృక్పథంతో కూరగాయలు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముంపు ప్రాంతాల్లో నిత్యం టీడీపీ నాయకులు పర్యటిస్తూ ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీసీ సెల్ పట్టణ అధ్య క్షుడు వాకా మాధవరావు, నేతలు జొన్నాదుల బాలకృష్ణ, కారంపూడి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న వరద ఉధృతి.. బయటపడుతున్న పంటలు, ఆలయాలు

● బ్యారేజీ నుంచి నీటి విడుదల 7 లక్షల క్యూసెక్కులకు తగ్గింపు
● తేరుకుంటున్న కరకట్ట పరిసర గ్రామాలు



పెదకొండూరులో ముంపు నుంచి బయటపడుతున్న శ్రీకనపుట్టలమ్మ ఆలయం

దుగ్గిరాల, సెప్టెంబరు 3: ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల తగ్గుతుండటంతో కరకట్ట పరిసర గ్రామాలు తేరుకుంటు న్నాయి. సోమవారం 11లక్షలకు పైగా ఉన్న వరద నీటి విడుదల మంగళవారం సాయంత్రానికి 7లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. దీంతో కరకట్ట అంచు నుంచి ఐదడుగులకు పైగా వెనక్కు తగ్గడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. పూర్తిగా మునిగిన పెదకొండూరు శ్రీకనక పుట్టలమ్మతల్లి ఆలయం, శ్రీజనార్ధనస్వామి, శ్రీరాజేశ్వరస్వామి, శ్రీఆనందేశ్వరస్వామి ఆలయాలు నీటి ముంపు నుంచి బయట పడుతున్నాయి. వరద ఉధృతి తగ్గుతుండటంతో పంటపొలాలు, ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. గొడవర్రు, అత్తలూరిపాలెం మధ్య కరకట్ట బలహీనమై కోతకు గురవుతున్న రెండుచోట్ల ఇసుకబస్తాలతో కంకర ఇసుకకలిపి వేసిన ప్రమాదం నుంచి బయట పడినప్పటికీ, కరకట్టను బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పెదకొండూరులో వరదలో చిక్కుకు పోయిన కొన్ని గేదెల ఆచూకీ లభించలేదని చెబుతున్నారు. చిలువూరు, మంచికలపూడి, కేఆర్ కొండూరు తదితర గ్రామాల్లో డీఆర్‌టీసీ వాగు కారణంగా ఇండ్ల చుట్టూ చేరిన వరద నీరు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నాయి. వంతెన లేక పోవడంతో ఎస్సీకాలనీ వాసుల ఇబ్బందులు పూర్తిగా తొలగలేదు. సపోటా, నిమ్మ, జామ తోటల్లో నీరు ఇంకా నీరు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతూనే ఉన్నారు. మరో అల్పపీడనం ఏర్పడనుందని చెబుతుండటంతో, వర్షం తగ్గుముఖం పడితేనే ప్రజల్లో ఆందోళన తగ్గే అవకాశం ఉంది.

వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ



మగ్గాలను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 2: రెండు తెలుగు రాష్ట్రాల్లో విధ్వంసం సృష్టించిన వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలో వరద ముంపుకు గురైన రత్నాలచెరువు ప్రాంతంలో సీపీఐ నేతల బృందం మంగళవారం పర్యటించింది. నీళ్ల చేరిన మగ్గాల గుంతలను పరిశీలించి, బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లనే వర్షాలు వచ్చినప్పుడు ముంపు సమస్య ఉత్పన్నమవుతుందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో మునుపెన్నడూ లేని విధంగా భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయన్నారు. ఇప్పటివరకు వరదల్లో చిక్కుకుని 20 మంది మృతిచెందినట్టుగా తెలుస్తుందని లక్షలాది మంది పేదల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో సీఎం చంద్రబాబుతో సహా ప్రభుత్వ యంత్రాంగం వరద సహాయక చర్యల్లో చక్కగా పనిచేస్తుందని కితాబిచ్చారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రధాని నరేంద్ర మోదీ తెలుగు రాష్ట్రాల్లో పర్యటనకు రావాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావంతో విషజ్వరాలు ప్రబలే అవకాశం వున్నందున వైద్య సిబ్బంది, మందులను అందుబాటులో వుంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలు చేయడం మానుకుని ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు నందం బ్రహ్మేశ్వరరావు, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో ముంపు సహాయక చర్యలు



పెదవడ్లపూడిలో ఇళ్లలో చేరిన వర్షపు నీటిని తోడిస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 3: మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో టీడీపీ నాయకులు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు పారే మార్గం లేకపోవడంతో ఆయిల్ ఇంజన్ల సహాయంతో నీటిని తోడిస్తున్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ నేతలు మాదల రమేష్, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్, గుడిమెట్ల ఎల్లయ్య కట్టా దుర్గారావు, అద్దంకి సామ్రాజ్యం తదితరులు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

ఆయిల్ ట్యాంకర్‌లో వ్యాపించిన మంటలు

● ఖాళీ ట్యాంకర్ కావడంతో తప్పిన ప్రమాదం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3: మంగళగిరి మండలం కాజ గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఓ ఆయిల్ ట్యాంకరులో మంగళవారం మంటలు చెలరేగాయి. విజయవాడ ఆటోనగర్ నుంచి గుంటూరు వైపు వెళుతున్న ఐవోసీ ఆయిల్ ట్యాంకరుకు వెనుక వైపు చక్రం డ్రమ్ములు పట్టివేయడంతో రాపిడికి మంటలు చెలరేగాయి. గమనించి డ్రైవర్ హుటాహుటిన పోలీసులకు, టోల్‌గేటు సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బందికి వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆయిల్ ట్యాంకర్ ఖాళీగా ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఘటనా స్థలాన్ని సందర్శించి ట్యాంకర్‌ను పరిశీలించారు.

మహానాడులో ముంపు తగ్గింది

● కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు
● నది ఒడ్డు నివాసాల్లో తగ్గని వరద

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3: రెండు రోజులుగా ప్రకాశం బ్యారేజి దిగువన కృష్ణానది ఉగ్రరూపం దాల్చడంతో తాడేపల్లి పట్టణంలోని మహానాడు ప్రాంతం పూర్తిగా ముంపుకు గురైంది. కాగా మంగళవారం వరద ఉధృతి తగ్గడంతో 80శాతం మేర ముంపు ముప్పు తగ్గింది. వరద ఉధృతికి 16 రోడ్లు, 1000కి పైగా నివాసాలు బురదమయం అయ్యాయి. చిన్న చిన్న నివాసాల్లో ఉన్న వారు ఎలక్ట్రానిక్ సామాగ్రి దుకాణదారులు తీవ్రంగా నష్టపోయారు. నారా లోకేశ్ యువత, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దివీస్ ల్యాబ్స్, అక్షయపాత్ర, కాట్రగడ్డ మధు, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం తరపున ఆహారం పంపిణీ చేస్తున్నారు. మహానాడులో నారా లోకేశ్ స్ఫూర్తితో పట్టణ టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, చిన్నపోతుల చిన్న, దానబోయిన సుందరరావు యాదవ్, ఓలేటి రాము, అన్నెం కుసుమ, మండవ గోపాలరావు, కేళి వెంకటేశ్వరరావు, అద్దంకి మురళి, అంకాలరావు, నాగేశ్వరరావు తదితరుల నేతృత్వంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, డీసీ అశోక్ తదితరులు పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. నదీతీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా సీఐలు కళ్యాణ్‌రాజు, వినోద్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పునరావాస కేంద్రాలకు 250 మంది తరలింపు

తుళ్లూరు, సెప్టెంబరు 3: మండలపరిధిలోని ఉద్దండ్రాయునిపాలెం లంక గ్రామస్తులు 250 మందిని పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. వారిలో 150 మంది వరకు షెల్టర్‌హోమ్ నుంచి భోజన వసతి పొందుతున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. అలాగే 204 పశువులను సురక్షిత ప్రాంతానికి తరలించటం జరిగిందని తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఏఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధు సూదనరావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, తుళ్లూరు డీఎస్పీ మల్లికార్జునరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలబడతాం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3: విజయవాడ, వరద ప్రాంతాల్లో ఇబ్బంది పడుతున్న బాధితులకు అండగా నిలబడతామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం, విజయవాడ, చిట్టినగర్, 47వ డివిజన్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. బాధితులకు ధైర్యం చెప్పి భోజనం, వాటర్ బాటిల్స్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద నుంచి త్వరలోనే క్షేమంగా బయట పడతామని అన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని అన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ ప్రజలు, నాయకుల సహకారంతో దాదాపు 10వేల మందికి భోజనం అందజేసామని వివరించారు. ఈ సందర్భంగా స్పందించి భోజన ఏర్పాట్లు చేసిన నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, కల్లూరి శ్రీనివాస్, పంచుపర్తి శేషు, అవినాష్, కుమారస్వామి, పెండ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు టీడీపీ నేతల విరాళం



నగదు చెక్కులను మంత్రి లోకేశ్‌కు అందజేస్తున్న కొమ్మారెడ్డి, కళ్లం

మంగళగిరి, సెప్టెంబరు 3: వరద బాధితుల సహాయార్థం మంగళగిరి టీడీపీ నేతలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాన్ని అందించారు. తాడేపల్లి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, రాజధాని అమరావతి పరిరక్షణ సమితి నాయకులు, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి చెరో రూ.పది లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. ఈ మేరకు నగదు చెక్కులను మంగళవారం సాయంత్రం విజయవాడ కలెక్టరేట్‌లో మంత్రి లోకేశ్‌కు అందించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన కొమ్మారెడ్డి కిరణ్, రాజశేఖర్‌రెడ్డిలను లోకేశ్ అభినందించారు.

అప్రమత్తంగా ఉన్నాం : ఎస్పీ సతీష్‌కుమార్

● సీతానగరం పుష్కరఘాట్ల వద్ద కృష్ణానది వరద ఉధృతి పరిశీలన

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3: అప్రమత్తంగా ఉన్నాం.. కృష్ణానది వరద ఉధృతి ప్రాంతాల్లో తమ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించారని గుంటూరు అర్బన్ ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. తాడేపల్లి పరిధిలోని సీతానగరం పుష్కరఘాట్ల వద్ద వరద ఉధృతిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ కొల్లిపర, పెదకాకాని, తుళ్లూరులో కొన్ని ప్రాంతాలు, తాడేపల్లిలోని మహానాడు ముంపునకు గురయ్యాయన్నారు. పెదలంక వద్ద గడ్డు పరిస్థితిని ఎదుర్కొని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో నాటు పడవల ద్వారా బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గే దాకా అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా ఇవ్వడం జరిగిందని, తాడేపల్లి పోలీసులు బాగా కష్టపడ్డారని తెలిపారు. సీఐ వినోద్ కుమార్ ఎస్పీ వెంట ఉన్నారు.

నీట మునిగిన ఉద్యాన పంట పరిశీలన

● ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయి పర్యటన



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3: ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే.శ్రీనివాసులు ఆ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి మంగళవారం భారీ వర్షాల ధాటికి నీట మునిగిన పంటలను పరిశీలించారు. మంగళగిరి మండలం నూతక్కి, రామచంద్రాపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతు బొల్లా సతీష్‌రెడ్డికి చెందిన పసుపు పంటను పరిశీలించి పంట వయస్సు, సాగుకు అయిన ఖర్చును అడిగి తెలుసుకున్నారు. పంట వేసి రెండు నెలలైందని, సాగు నిమిత్తం రూ.లక్షా పది వేలు ఖర్చు చేశానని రైతు బదులిచ్చారు. గుంటూరు సుధీర్ అరటి పంటను పరిశీలించారు. మిరపతోపాటు అంతర్ పంటగా బంతి తోటను వేశారు. ఆయా పంటలు ఐదు రోజుల నుంచి పూర్తిగా నీటిలో మునిగిపోయాయని రైతులు తెలిపారు. లాం శాస్త్రవేత్త డాక్టర్ సీవీ రమణ మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాల నుంచి నీరు బయటకు పోయిన తర్వాత పంట కుళ్లిపోయి ఆకు పసుపు రంగులోకి మారడం ద్వారా మొక్క చనిపోతుందని, వాటిని సంరక్షించుకునే విధానాలను వివరించారు. అనంతరం పేరుకలపూడి డొంకను సందర్శించి రేపల్లె కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం నూతక్కి సచివాలయం వద్ద రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రేపల్లె కెనాల్‌పై నాన్‌రిటర్న్ వాల్ ఏర్పాటు కోసం రైతులు అర్జీ ఇచ్చారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని ఎన్యుమరేషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి బి.రవీంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, మండల ఉద్యాన శాఖ అధికారి కే.దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ చీఫ్ సెక్రటరీ



పెదకొండూరులో దెబ్బతిన్న పొలాలను పరిశీలించేందుకు వచ్చిన వ్యవసాయశాఖ ప్రత్యేక ఉన్నత కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు తదితరులు

దుగ్గిరాల, సెప్టెంబరు 3: మండలంలోని పెదకొండూరులో కృష్ణానది వరదలతో దెబ్బతిన్న పంట పొలాలను రాష్ట్ర వ్యవసాయశాఖ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు ఇతర ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. నాలుగురోజులుగా వరద ముంపుతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన అధికారులు, రైతులు తమ పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో పలు సూచనలు చేశారు. వరద నీటిని బయటకు పంపిన అనంతరం ఎకరాకు 25కిలోల యూరియా, 15కిలోల పొటాషియం వేయాలని, తద్వారా వరిపంట మామూలు స్థితికి చేరు కుంటుందని తెలిపారు. లంకగ్రామాల్లో మునిగిన పొలాలన్నింటినీ పూర్తి స్థాయి పంట నష్టంగా పరిగణిస్తామని రైతులకు తెలియజేశారు. జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ పి.సత్యనారాయణ, ఏవో పి.శిరీష, పలువురు రైతులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో పాల్గొనాలి : కేసన

మంగళగిరి, సెప్టెంబరు 3: రాజకీయాలు చేయడానికి ఇది సమయం కాదని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరద సహాయక చర్యల్లో సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అభినందనీయమన్నారు. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి బాధితులను పరామర్శిస్తూ, ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి బాధితులందరికీ నిత్యావసరాలు, ఆహారం, మంచినీళ్లు అందించడం పట్ల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం బుడమేరు కట్టకు మరమ్మతులు చేయించి బలోపేతం చేసివుంటే విజయవాడకు ఇప్పుడు ఇంతటి ఉపద్రవం వచ్చేది కాదన్నారు.



సమావేశంలో సిబ్బంది నుంచి ఫీవర్ సర్వే వివరాలు తెలుసుకుంటున్న జోనల్ ఆఫీసర్ డాక్టర్ సుచిత్ర

జ్వరపీడితులకు తక్షణవైద్యం అందాలి

● జోనల్ ఆఫీసర్ డాక్టర్ సుచిత్ర

తెనాలి రూరల్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే ద్వారా జ్వరపీడితులను గుర్తించి వారికి తక్షణ వైద్యసేవలు అందేలా బాధ్యతగా మెలగాలని జోనల్ ఆఫీసర్ డాక్టర్ సుచిత్ర అన్నారు. మండలంలోని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఓపీ నమోదు, అందుబాటులో ఉన్న మెడిసిన్, బ్లడ్ టెస్ట్, వార్డుల్లో సౌకర్యాలను ఆమె పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారులు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, ఆరోగ్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టి వారికి తక్షణవైద్యం మందులు అందేలా చూడాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పీహెచ్‌సీకి వైద్యసేవలకు వచ్చేవారికి తగిన గౌరవంఇచ్చి వ్యాధి తగ్గి ఆరోగ్యవంతులుగా తిరిగి వెళ్లేలా బాధ్యతగా మెలగాలన్నారు. పీహెచ్‌సీలో పలువురు రోగులను వైద్యసేవలపై ఆరాతీయగా వైద్యం బాగుదని బదులివ్వడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ లతాబాయ్, డాక్టర్ షేక్ హనీఫ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు

పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3: వర్షాల కారణంగా పేదలు నివసించే కాలనీల్లో దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. మదర్‌థెరిస్సా ఫ్రెండ్స్ సర్కిల్, నేషన్ బిల్డర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ, వరుస వర్షాలతో పేదలకు పనిలేకుండా పోయిందని, వారిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. సంఘంలోని సభ్యులంతా సహాయ సహకారాలు అందించారని మరింత సేవలు చేసేందుకు తోడ్పాటు అందించాలన్నారు. ప్రసాద్, రామారావు, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఫణీంద్ర, మధు, రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఫార్మసీ కళాశాలలో కంటి వైద్య శిబిరం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3: బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. సమాజంలో ఎంతోమంది చూపులేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి చూపును ప్రసాదించేందుకు అవసరమైన నేత్రదాన చైతన్యాన్ని ప్రజల్లో కల్పించాలన్నారు. నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ భాస్కర్, ప్రిన్సిపల్ వెంకటరమణ, నారాయణరావు, జ్యోతిబసు, కళ్యాణచక్రవర్తి, భార్గవి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

60 అడుగుల భారీ గణపతి విగ్రహం ముస్తాబు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3: ఈ నెల 7న వినాయక చవితి పండుగ పురస్కరించుకుని తెనాలి-విజయవాడ రోడ్డులోని 60 అడుగుల భారీ గణపతి విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ఎదుట ఆర్ అండ్ బీ రహదారి వెంట ఈ విగ్రహాన్ని తెనాలికి చెందిన కొనిజేటి గోపీకృష్ణ, అమిరినేని రాజా దాతల సహకారంతో 2007లో ప్రతిష్ఠించారు. ప్రతిఏటా వినాయక చవితి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలి

● సీపీఎం పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 3: పట్టణ పురపాలక సంఘ పరిధిలోని రోడ్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్ కమిషనర్ శేషన్నను కోరారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం పురపాలక సంఘ పరిధిలో భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రాన్ని సీపీఎం పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్, హుస్సేన్‌వలిలు అందజేశారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ కొద్దిరోజులుగా పడుతున్న వర్షాల వల్ల రోడ్లకు గుంటలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అన్నారు. ప్రమాదకమైన స్పాట్లకు మార్కింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు షేక్ హుస్సేన్ వలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరదలు వల్ల రైతులకు అపారమైన నష్టం జరిగిందని రైతులకు తగిన నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరం గ్రామాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం తూములూరు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి మహిళలను, వృద్ధులను పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న 215 మందికి స్థానిక నాయకులతో కలిసి పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీ భీమారాణి, నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, బొమ్మ శ్రీనివాసరెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపురం ఛానల్‌లో పూడికతీత ప్రారంభం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: పొన్నూరు పట్టణంలోని శ్రీరంగపురం ఛానల్‌లో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పొన్నూరు మండలంలో పలు గ్రామాలకు ప్రధాన జలవనరుగా ఉన్న శ్రీరంగపురం ఛానల్ పొన్నూరు పట్టణంలో ఆక్రమణలకు గురవటమే కాకుండా క్రమేపీ పూడిక పేరుకుపోయింది. దీంతో ఛానల్ నుంచి దిగువ గ్రామాలకు సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే 2018లో ఛానల్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా పొన్నూరు పట్టణ పరిధిలోని ఛానల్ ప్రవహించే ప్రాంతాలో కాల్వ లైనింగ్ పనులు చేశారు. రెండో దశ పనులు జరిగే సమయంలో ప్రభుత్వం మారిపోవటంతో శ్రీరంగపురం ఛానల్ ఆలనపాలన చూసే వారు కరువయ్యారు. దీంతో క్రమేణా కాల్వలో గుర్రపు డెక్క, తూటికాడ పెరిగిపోవటమే కాకుండా పలు ప్రాంతాలో పూడికతో నిండిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ పూడికలు అవరోధంగా మారాయి. కాల్వ నీరు ప్రవహించే జలాలు అన్ని సమీపంలోకి పంట పోటాలోకి, నివాస ప్రాంతాలోకి చేరాయి. సోమవారం డివిసి కాలనీని సందర్శించి న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దృష్టికి స్థానికులు కాల్వ విషయం తీసుకు వెళ్లటంతో తక్షణమే సాగునీటి శాఖ అధికారులను పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో అధికార యంత్రాంగం శ్రీరంగపురం ఛానల్ పూడికతీత పనులు ఆగమేఘాల మీద ప్రారంభించారు.

మూడు రోజులుగా నీటిలోనే పైర్లు

ఆందోళనలో అన్నదాతలు



మండలంలోని హాఫ్‌పేట వద్ద మునిగిపోయిన వరిపైర్లు

తెనాలి రూరల్, సెప్టెంబరు 3: మూడు రోజులుగా మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట, పెదరావూరు, బుర్రిపాలెం వంటి పలు గ్రామాల్లో వరి పంటలు నీటిలోనే మునిగిపోయి ఉన్నాయి. భారీ వర్షం కారణంగా కాలువలు పొంగిపొర్లుతుండటంతో పంట పొలాల్లో నీటిని బయటకు పంపే వీలు లేక కళ్లముందే పంటలు దెబ్బతింటుంటే అన్నదాతల ఆవేదన వర్ణణాతీతంగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 16,624 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ప్రారంభంలో వర్షాలు కురవగా నేల ఆరుదలకు 10-20 రోజులు సమయం పట్టింది. సాగు చేపట్టే సమయం కంటె నెల ఆలస్యంగా వెద పద్ధతిలో వరి విత్తనాలను భూమిలో చల్లారు. అవి దాదాపుగా ఎదుగుదల దశలో ఉండటంతో డీఏపీ, యూరియా వంటివి చిమ్మి సస్యరక్షణ చర్యలు ముమ్మరం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురిసిన భారీ వర్షాలకు ఆ పంటపొలాలన్నీ జలమయమై పైర్లు మునక వేశాయి. పంటపొలాల చుట్టూ భారీగా నీరు చేరడంతో పైర్లు కాపాడుకునేందుకు వీలులేక పంటలు దెబ్బతింటాయని అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. వర్షంతగ్గి మూడు రోజులు గడుస్తున్నా వరద ఉధృతి తగ్గకపోవడంతో తమ పంటలు చేతికందవని కౌలు, పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోయామని రైతాంగం తీవ్రనిరాశలో ఉన్నారు. తిరిగి సాగు చేపట్టేందుకు కూడా సమయం అనుకూలించదని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

పంట పొలాలను పరిశీలించిన మంత్రి మనోహర్

ఒక పక్క భారీ వర్షం, మరోపక్క నల్లమల డ్రెయిన్ తెగిన కట్టతో తమ పంటభూములు చెరువులుగా మారి పైర్లను నిండాముంచేశాయని తమకు అపార నష్టాన్ని మిగిల్చాయని మంత్రి మనోహర్ ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రి మనోహర్ మండలంలోని హాఫ్‌పేట-కాజీపేట గ్రామాల్లోని వరిపైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పంటలు వరద ఉధృతికి నీటమునిగి వరినారు పూర్తిగా దెబ్బతిందని తమకు పూర్తినష్టం వాటిల్లిందని మనోహర్‌కు నారు చూపి వారు పడుతన్న ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పంటలనష్టంపై వివరించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రైతులు ఎవ్వరూకూడా అధైర్యపడవద్దన్నారు. తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, పలువురు జనసైనికులు, వ్యవసాయశాఖ అధికారులు పలువురు రైతులు పాల్గొన్నారు.

పైర్లను పరిశీలించిన స్పెషల్ సెక్రటరీఆఫ్ అగ్రికల్చర్

మండలంలోని హాఫ్‌పేట - కాజీపేట వంటి ప్రాంతాల్లో నీటమునిగిన వరిపైర్లను ఆంధ్రప్రదేశ్ స్పెషల్ సెక్రటరీఆఫ్ అగ్రికల్చర్ పి.రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావులు కలిసి పరిశీలించారు. పంటలు పూర్తిగా నీటమునిగి ఉండటాన్ని గమనించిన అధికారులు స్వయంగా సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ తమ పంటలు నీటమునిగి మూడు రోజులు దాటాయని వరద ముంపు మరో రెండు మూడు రోజులు వరకూ ఉంటుందని అంచనాలున్నాయన్నారు. తమ పంట పొలాల్లో నీరు బయటకుపోయే మార్గంకూడా లేదని నల్లమల డ్రెయిన్‌కు గండిపడటం వల్ల వరద ఉధృతి తమపైర్లపై పడిందన్నారు. ఇప్పటికే దాదాపుగా కౌలుతో కలిపి రూ.35వేలు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి న్యాయం చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ తెనాలి మండలంలో ఇప్పటికే వ్యవసాయాధికారులు నష్టం అంచనా వేస్తున్నారని తెలిపారు. దాదాపుగా 10 వేల 940 ఎకరాల మేర పంటలు వరద ముంపులో ఉన్నట్లు చెప్పారు. త్వరగా ఈ క్రాఫ్ నమోదు చేపట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశించామన్నారు. వరద అనంతరం పంటనష్టం అంచనావేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, తెనాలి ఏడీఏ ఉషారాణి, ఏఈవో మోహన్, బీఏఏలు నాగేంద్ర, నాగరాజు వంశీ, తేజ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.



పెదకాకానిలో వర్షం కారణంగా దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, అగ్రికల్చర్ డైరెక్టర్ ఢిల్లీరావు

● పెదకాకాని: తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను రాష్ట్ర అగ్రికల్చర్ డైరెక్టర్, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి.రాజశేఖర్, అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావులు మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని నంబూరు, వెంకట కృష్ణాపురం, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి పి.సంధ్యారాణి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, సర్పంచి ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



పడవలోకి చేరుస్తున్న వాటర్ బాటిల్స్

వరద ప్రాంతాలకు కుమార్ పంప్స్ నీరు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3: వరద ప్రభావిత ప్రాంతాలకు కుమార్ పంప్స్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసింది. తెనాలి సుల్తానాబాద్‌లోని శుభ్రం వాటర్ ప్లాంట్ నుంచి ఐదు వేల బాటిల్స్‌ను సంస్థ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం మంగళవారం పంపించారు. మూడు రోజులు అయినా కూడా వరద తగ్గుముఖం పట్టకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలు తాగు నీరు, ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరిన వెంటనే ఆయన వితరణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వాటర్ బాటిల్స్‌ను ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు.



వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు వెంకటపూర్ణచంద్, వెంకటరత్నం తదితరులు

వరద బాధితులకు ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 3: వరద బాధితులకు ఆహారం పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు నిర్వహించారు. మంగళవారం లంక గ్రామాలలో వచ్చిన వరదల కారణంగా కొల్లిపర మండలం తూములూరు గ్రామ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని బాధితులకు అన్నదాన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, నల్లూరి వెంకటేశ్వరావు, చిన్న కోటిరెడ్డి, కేసన వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలంకలో ఆహారాన్ని అందిహిస్తున్న టీడీపీ నాయకులు

పునరావాస కేంద్రాల్లో అన్నదానం

కొల్లిపర, సెప్టెంబరు 3: మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని తూములూరు హైస్కూల్ పునరావాస కేంద్రంలో రోటరీ క్లబ్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అన్నవరంలంకలో ఐటీడీపీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం నాయకులు కుదరవల్లి శ్రీనివాసరావు వితరణతో భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మల్లవరపు విజయ్, ఐటీడీపీ సభ్యులు యోగేష్, గోనుగుంట్ల కన్నయ్య పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని రెండు మృతదేహాలు లభ్యం

పెదకాకాని, సెప్టెంబర్ 3: గుర్తుతెలియని రెండు మృతదేహాలను స్వాధీనపరచుకున్నట్లు పెదకాకాని పోలీసులు మంగళవారం తెలిపారు. గుంటూరు ఛానల్లో ఈ రెండు మృతదేహాలు నీటి ప్రవాహంలో కొట్టుకొని వచ్చినట్లు తెలిపారు. రెండు మృతదేహాలు కూడా గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన బీజేపీ నాయకులు


కొల్లిపర, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు, వరదలకు కొల్లిపర మండలంలో పంటలు నీట మునగటంతో మంగళవారం బీజేపీ నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకోనున్నట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వారిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వాసుదేవ నాయుడు, ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎడ్లపాటి స్వరూపరాణి, టొబాకో బోర్డ్ మాజీ ఛైర్మన్ రఘునాధబాబు, మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను నిర్వహించడానికి విజయవాడకు తరలివెళుతున్న మున్సిపల్ కార్మికులు

విజయవాడకు తరలిన పారిశుధ్య కార్మికులు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 3: వరద సహాయ చర్యలలో భాగంగా పారిద్య పనులను వేగవంతం చేయడానికి మంగళవారం పట్టణ పురపాలక సంఘం నుంచి పారిశుధ్య కార్మికులను పట్టణ కమిషనర్ శేషన్న విజయవాడకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పురపాలక సంఘం నుంచి 50మంది పారిశుధ్య కార్మికులను విజయవాడలోని శానిటేషన్ పనులను చేయడానికి పంపామని తెలిపారు. వరద సహాయక చర్యలలో భాగంగా పారిశుధ్య కార్మికులు డ్రెయిన్‌లోని, మురుగు కాలువలలోని వ్యర్థాలను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరుచుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డీవీసీ కాలనీలో గృహాల నడుమ ఉన్న నీటిని తోడుతున్న మోటారు

డీవీసీ కాలనీలో నీటి తోడివేత ప్రారంభం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: తుంగభద్ర డ్రెయిన్ ప్రవాహ ఉధృత్తికి నీటి ముంపునకు గురైన డీవీసీ కాలనీలో నీటిని మళ్లించే చర్యలు ప్రారంభమయ్యాయి. డీవీసీ కాలనీ నుంచి మురుగు బయటకు పారే ఛానల్ నుంచి తుంగభద్ర డ్రెయిన్ వరద నీరు ఎగువకు ప్రవహించి కాలనీలోని గృహాలు జలమయం అయ్యాయి. గత మూడు రోజులుగా కాలనీలో పదుల సంఖ్యలో గృహాలు నీటిలో నానుతున్నాయి. నీటి ముంపుకు గురైన గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి గృహాల నడుమ నిల్వ ఉన్న నీటిని బయటకు మళ్లించే ప్రయత్నాలు పురపాలక సంఘం అధికారులు ప్రారంభించారు. మోటార్లను ఏర్పాటు చేసి గృహాలో నిల్వ ఉన్న నీటిని తోడుతున్నారు. అలాగే నీటి ముంపువల్ల ఇబ్బంది పడుతున్న స్థానికులకు పురపాలక సంఘం అధికారులు ఆహారం, తాగునీరు సరఫరా చేయటమే కాకుండా మెడికల్ క్యాంప్‌ను కొనసాగిస్తున్నారు. కాల్వ ఉధృతి తగ్గినందున ఒక్కరోజులో డీవీసీ కాలనీలో పరిస్థితి చక్కపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్, సెప్టెంబరు 3: పింఛన్ కోసం అని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని పెదరావూరు జగనన్న కాలనీలో ఉండే 65 సంవత్సరాల అద్దంకి శ్రీనివాసరావు గత నెల 31న పింఛన్ కోసమని తెనాలి సీఎం కాలనీ సచివాలయానికి వెళ్లి వస్తానని ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో భార్య రమణ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందించే తీరు ఇదేనా..?

● డేట్ అయిపోయిన రాగిపిండి ప్యాకెట్లపై మంత్రి ఆగ్రహం



డేట్ ముగిసిన ప్యాకెట్లను చూపి కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 3: విద్యార్థులకు పౌష్టికాహారం అందించే తీరు ఇదేనా అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ప్రశ్నించారు. పట్టణంలోని పునరావాస కేంద్రంలో ఉన్న గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థుల యోగక్షేమాలు విచారించేందుకు వెళ్లిన మంత్రి మనోహర్ వారికి అందించే రాగిజావకు సబంధించిన ప్యాకెట్లను పరిశీలించారు. వాటిపై వినియోగించే డేట్ ముగిసి ఉండటాన్ని గుర్తించి అధికారులను నిలదీశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారంపై అధికారుల పర్యవేక్షణ లేదనే విషయం వీటిని చూస్తేనే స్పష్టమౌతుందన్నారు. ఇకపై ఇటువంటి పొరపాటు జరిగేతే ఉపేక్షించేది లేదని సున్నితంగా హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తుందన్నారు. అధికారులు ఎక్కడా కూడా పొరపాటు జరకుండా ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. మెనూ ప్రకారం వేడివేడిగా ఆహారం అందించాలని ఆయన ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ శేషన్న, హాస్టల్ వార్డెన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలి

● సబ్ కలెక్టర్ సంజనాసింహ



పడవలో లంక గ్రామాలకు వెళుతున్న సబ్‌కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర, సెప్టెంబరు 3: కృష్ణానదికి వరద ఉధృతి కొనసాగుతోందని లంక గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలని సబ్‌కలెక్టర్ సంజనాసింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, అన్నవరం లంక గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద తగ్గేవరకు తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంజనాసింహ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదనీటి ముంపు తగ్గేవరకు నివాసితులకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు తదితరులు ఉన్నారు.



వెల్లలూరులో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు

వరి పైరులో చీడపీడల నివారణ చర్యలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: వరద ముంపుబారిన పడిన వరి పైరులో చీడపీడలు ప్రబలే అవకాశం ఉందని రైతులు జాగ్రత్తలు పాటించాలని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు, గోళ్లమూడిపాడు గ్రామాలో నీట మునిగిన వరి పైరును మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని మళ్లించాలని సూచించారు. ప్రతి ఎకరానికి బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పిచికారి చేయాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యగా ఎకరానికి క్లోరిపైరిపాస్ 20ఇసి 400 మి.లీటర్లు, కార్బన్‌డిజం, మ్యాంగో ఈచ్ 200లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారి చేయాలన్నారు. పొటాషియం నైట్రేట్ ఒక కేజి ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌ప్రతిభశ్రీ, డాక్టర్ కిషోర్ వర్మ, స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏవో దేగల వెంకట రామయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

● మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు నీట మునిగి పంటలు కోల్పోయిన అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలో నండూరు చిన్న ఇట్టికంపాడు పెద్దపాలెం, వల్లభరావుపాలెం, కసుక్రు, సీతారామపురం, ఉప్పరపాలెం, పెద్దఇట్టికంపాడు గ్రామాలో కూటమి పార్టీల నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు నీటమునిగిన వరి పైర్లను రైతులతో కలిసి పరిశీలించారు. పంట పొలాల్లో నుంచి నీరు బయటకుతీసే అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలియజేసిన సమస్యలను ఎమ్మెల్యే నరేంద్ర దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పంట నష్టపరిహారం లెక్కించేందుకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అధికారులను ఆదేశించినట్లుగా రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, మండల అధ్యక్షుడు బి.బాబురావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

● ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు రామారావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్‌చేశారు. మండల పరిధిలోకి ఇట్టికంపాడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన నిర్మాణ రంగ కార్మికుడు జంగా ఏసోబు కుటుంబానికి రూ.30వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందచేశారు. ఏసోబు పెయింటింగ్‌రంగ కార్మికుడిగా పనిచేస్తూ మృతి చెందాడు. ఏసోబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన నాయకులు యూనియన్ తరపున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.హెబ్సిబజర్‌బాబు, గుమ్మడి రోశయ్య, షేక్ సాధిక్‌బాషా, ఆర్. శివాజీ, బాజీ, రామాంజనేయులు, బి.మాణిక్యరావు, వీరయ్య, ఖాసిమ్, రమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు తీరుతోనే వరద బాధితులకు సాయం

● జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందిస్తున్న తీరుతోనే వరద బాధితులకు సకాలంలో సాయం అందుతుందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి మంగళవారం అన్నారు. 74ఏళ్ల వయస్సులో రాత్రనక, పగలనక సమీక్షలు జరుపుతూనే మరోవైపు వరద బాధితులను రక్షించే సహాయ చర్యలతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో జగన్ వైపరీత్యాల సమయంలో హెలికాఫ్టర్‌లో తిరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ వరద ప్రాంతాలలో తిరుగుతూ బాధితుల దగ్గరకే వెళ్లి పరామర్శించి అండగా ఉంటున్నారన్నారు. స్పందించే తీరులో చంద్రబాబుకు, జగన్‌కు తేడాలు ఉన్నాయన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 3: పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరముల ప్రకారం స్థానిక పాండురంగపేటలోని ఒక ఇంట్లో పేకాట అడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆ ఇంటిపై దాడులు నిర్వహించామన్నారు. ఇందులో పేకాట అడుతున్న ఐదుగురిని అరెస్టుచేసి వారి వద్దనుండి రూ.5900 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ధర్మారావుమాదిగకు రూ.15వేలు సాయం

తెనాలి రూరల్, సెప్టెంబరు 3: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామం కొలకలూరు చేరుకున్నారు. ఆయనను యాక్ట్ చైర్మన్ గోళ్లమూడి ప్రభాకర్ మంగళవారం పరామర్శించి రూ.15వేలు సాయం అందించారు.